



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్






అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 309 | బుధవారం 27 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## రేర్ మినరల్స్ పై దృష్టి

- 20 బిలియన్ డాలర్ల సమీకరణకు ఓకే
- క్వాడ్ దేశాల నిర్ణయం
- భారత్ లోని ముఖ్యఖనిజాలపై అమెరికా కన్ను

2




## ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే..

- కర్ణాటక కాంగ్రెస్ ప్రక్షాళనకు అధిష్ఠానం కసరత్తు
- ఢిల్లీ చేరిన సిద్ధరామయ్య, డీకే శివకుమార్
- ఖర్గే నివాసంలో నేడు కీలక భేటీ
- కర్ణాటక లీడర్‌షిప్ మార్పుపై ముమ్మర చర్చలు
- త్వరలో రాజ్యసభ, మండలి స్థానాలకు ఎన్నికలు

3





### గ్రామ పంచాయతీ సిబ్బందికి

## ఒకటో తారీఖునే జీతాలు

- ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేక నిధులు
- ఇక నుంచి బ్యాంక్ ఖాతాల్లోనే పింఛన్లు జమ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్– సూర్య వాస్తవం

రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఐఏఎస్

- మిగతా 3లో..



# బీఫ్ ఛోడో.. దిల్ జోడో..!!

ఈ ఏడాది బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింసమాజం ఆకస్మిక నిర్ణయం తీసుకొంది. పండుగ నాటి ఖుర్బానీ క్రతువులో తనకు తాను సడలింపులు ప్రకటించుకుంది. ఈ మారు జంతు బలిచ్చే సంప్రదాయంలో సంయమనం పాటించాలని నిర్ణయించుకుంది. ఖుర్బానీలో ఆవును పూర్తిగా మినహాయించాలని తీర్మానించుకుంది. గొర్రెలు,పొట్టేళ్లను మాత్రమే ఖుర్బానీకి ఎంపిక చేసుకోవాలని నిశ్చయించుకుంది. నిజంగానే గోవధ పట్ల హిందూ సమాజానికి అభ్యంతరాలుంటే, ఆ సమాజ మనోభావాలను గౌరవించేందుకు సమ్మతి తెలిపింది. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో హిందూ,ముస్లిం.. ఐక్యతను చాటేందుకు సమాయత్తమైంది. గో మాతను జాతీయ జంతువుగా ప్రకటించి పరిరక్షించాలని తానూ డిమాండ్ చేస్తోంది. అందుకు హిందూ సమాజంతో జతకట్టి ఉద్యమిస్తామని నొక్కిచెపుతోంది. గో రక్షణ పేరుతో దేశ వ్యాప్తంగా దశాబ్దాలుగా జరుగుతున్న రాజకీయ యాగీకి వివేకంతో పరిష్కారం చూపింది.

- ముస్లిం సంఘాలు, జమాత్‌లు, ధార్మిక వేత్తల పిలుపు..
- స్వాతంత్ర్యోదమ స్ఫూర్తితో హిందూ, ముస్లిం ఐక్యతారాగం

- ఆవు,చాటు రాజకీయాలకు చరమగీతం..
- మూకదాడి కుతంత్రాలకు చెల్లుచీటీ ..
- విద్వేష శక్తుల కుయుక్తులకు విరుగుడు. .
- ముస్లింల నిర్ణయానికి సర్వత్రా హర్షం..
- స్వాగతిస్తున్న హిందూ ధార్మిక సంఘాలు..

మహ్మమ్మద్ షఫీ అహ్మద్,
సూర్య వాస్తవం,ప్రత్యేక ప్రతినిధి..

ఇస్లాం ధర్మంలో అత్యంత ప్రాధాన్యత గల ఈ దుజ్జుహా పర్వదినాన్ని పురస్కరించుకొని 'బక్రీద్' పండుగ సంప్రదాయ క్రతువులు భక్తి ప్రపత్తులతో ప్రారంభయ్యాయి. విశ్వవ్యాప్తంతా కోట్లాది ముస్లింలు ఈ పండుగను ఘనంగా జరుపుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వార్షిక హజ్ విధిలో భాగంగా ప్రపంచం

- మిగతా 2లో..



## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

- అనుమతిచ్చిన కోర్టు
- నేడు చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలింపు
- విచారించనున్న బృందం

3

## పొలం నుండి ఇంటికి...

- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కొత్త వ్యూహం
- దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ
- సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి – సూర్య వాస్తవం

వ్యవసాయ ఉత్పత్తులను పొలం నుండి నేరుగా వినియోగాదారుల ఇళ్లకు (ఫార్మ్ టు హోమ్) చేర్చేలా నూతన విధానం అమలుకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, ఇతర అనుబంధ శాఖలు, ప్రాథమిక రంగంలో 6 మిషన్లపై ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌పిఒ)లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పారు.

- మిగతా 3లో..




## నేటి నుంచి టిడిపి మహానాడు

- కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న అధినేత చంద్రబాబు
- పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లిపొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు
- క్లస్టర్ల వారీ వర్చువల్‌గా పాల్గొననున్న శ్రేణులు

3

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# బీఫ్...ఛోడో.. దిల్ జోడో..!!

(మొదటిపేజీ తరువాయి)
నలుమూలలనుంచి లక్షలాది ముస్లింలు పవిత్ర నగరం మక్కాకు చేరుకొని.. పవిత్ర గృహం కాబాచుట్టూ ప్రదక్షిణలో నిమగ్నమయ్యారు. లబ్బైక..అల్లాహుమ్మా లబ్బైక్ అంటూ సృష్టికర్తను కీర్తిస్తూ హజ్ విధుల్లో నిమగ్నమయ్యారు.

**బలిదానం మనో భావాలతో ముడిపడిన అంశం:-**

ఈ మారు అక్కడి సౌదీ ప్రభుత్వం, దేశీయ ప్రాధాన్యత గల జంతువు ఒంటెతో సహా, ఆవుల బలిదానంపై నిషేధం విధించింది. గొర్రెలు పొట్టేళ్ల ఖుర్బానీని మాత్రమే అనుమతించింది. వాస్తవానికి మనం దేశంలో ఆవుమాదిరిగానే సౌదీలో ఒంటె ,అక్కడి వారి మనోభావాలతో ముడి పడిని అంశం. కాని అక్కడ ఒంటె చుట్టూ విష వలయానికి అవకాశం లేనేలేదు. తద్ భిన్నంగా మనదేశంలో ఓ దశాబ్దం నుంచి ఆవు చుట్టూ విద్వేషం అలుముకుంటోంది. ఆవు మాంసం సాకుగా విద్వేష రాజకీయం బరితెగిస్తోంది. కొందరి ఆహార అలవాట్లను అరాచకంగా మార్చి దేశీ య జనాలను ఏమార్చి, ఓట్ల లబ్ది పొందే ప్రక్రియ నిరాటంకంగా సాగుతుంది. ఈ రాజకీయాలకు సాధు జంతువు ఆవు మాదిరిగానే, మూగ జీవులు ముస్లింలు బలవతున్నారు. పండగలకు పబ్బాలకు ఆ యాగీ అంతా, ఇంతా కాదు. మన దేశంలో అధికార పీఠానికి ఎగబాగేందుకు కుట్రలు,కుళ్లు ,కుతంత్రాలు,కుయుక్తులు ఆవు చుట్టే పరిభ్రమిస్తున్నాయి.

**మైనార్టీలపై మూకదాడికి అస్త్రంగా ఆవు:-**


విద్వేష రాజకీయాలు.. ఓట్ల మళ్లింపునకు 'ఆవు'ను అస్త్రంగా మార్చి,మైనార్టీ వర్గం దాడులు చేయడం దేశంలో పరిపాటి అయింది. ఇళ్లలో నిల్వ ఉన్న మాంసంపై కూడా నిఘా పెట్టి హింసించే స్థాయికి విద్వేషం వికృతరూపం దాల్చింది. 2015లో ఉత్తరప్రదేశ్ దాద్రిలోని మహ్మద్ ఇఖ్లాస్ ఇంట నిలువ ఉంచిన అరకిలో మాంసం, గోవుది కాకపోయిన గోరక్షణ పేరుతో అల్లరి మూక దాడి చేసి ఇంటి యజమాని ఇఖ్లాస్‌ను హతమార్చింది. కేసు తూతూ మంత్రం విచరణ దశలో.. ఫ్రిజ్‌లోని నిలువ మాంసం పొట్టేలుదిగా తేలింది. ఉత్తరాది సహా, ఈ శాన్య రాష్ట్రాల న్నింటిలో ఎన్నికలొస్తే చాలు.. ఓట్ల యంత్రంగా ఆవును ముస్తాబుచేసే ప్రకియ నిరాటకంగా సాగిపోతుంది.

**అధికార పీఠం కైవసానికి ఆవు రాజకీయం**

ఆవు రాజకీయం అధికార పీఠాన్ని హస్తంగతం చేసుకునే వరకు.. 'ఆవు' విద్వేషశక్తులకు ప్రణవాయువుగా పనికొస్తోంది. దేశంలోని 28 రాష్ట్రాలు 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో దశల వారిగా, ఆవు రాజకీయమే అధికార దండం అందించింది. దేశం మొత్తం మీద 80 శాతం భూ భాగంలో విద్వేష విస్తరింప చేసినా.. 'గో' మాతకు విముక్తి లభించడంలేదు.. అవసరమైనప్పుడల్లా .. అవకాశం చిక్కినప్పుడల్లా ఆవు చుట్టూ కుయుక్తులు, కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా 'ఆవు' చుట్టూనే విద్వేషం ఎజెండా చక్కర్లు కొడుతోంది. దేశ జనాభాలో మొత్తం మీద 15 నుంచి 20 శాతం మంది మాత్రమే శాఖాహారులు.. ఆపై మిగిలిన దేశ జనాభా ఆసాంతం మాంసా హారులే. ఈశాన్య రాష్ట్రాలతో పాటు కాశ్మీర్,బెంగాల్,బీహార్, కేరళ,తెలంగాణాలో మాంసాహారులు ఇంచుమించు 90 శాతం కంటే ఎక్కువని గణాంకాలు చెపుతున్నాయి. వాస్తవాలను మరుగున మర్చి విద్వేష శక్తులు ఎన్నికల లబ్ధికి జన సముదాయాల మధ్య ఆవు సాకుగా విషం చిమ్ముతున్నాయి.

**ఇటీవలి ఎన్నికల్లో ఆవు మాంసమే ఓట్ల యంత్రం**

నిన్న మొన్నటి అస్సాం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో 'ఆవు' మాంసమే ఓట్ల యంత్రం అయింది. రెండు చోట్ల విద్వేష కుయుక్తులే గట్టెక్కించాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఆవు మాంసం మెజారిటీ జనాలకు ప్రీతిపాత్రం., అక్కడ ఆవు రాజకీయం యూ టర్న్ తీసుకుంది. ఓట్ల లోటు రాకుండా ఆవు మాంసం తినే వెసులుబాటు కలిగింది. బెంగాల్‌లో సంపూర్ణ గో వధ నిషేధాన్ని వలగా విసిరి, మైనార్టీ వర్గాలను ఉక్కిరి బిక్కిరి చేసింది. కేంద్ర బలగాల నిర్బంధాలు, లక్షల సంఖ్యంలో మైనార్టీ ఓట్ల తొలగింపు,అధికార వ్యవస్థల అణిచివేత, మొత్తం మీద తృణముల్ కాంగ్రెస్ అధికారం చేజారడంతో మైనార్టీలపై ఉక్కు పాదం మోతాదు మరింత పెరిగింది. అనేక చోట్ల హింసా దౌర్జన్యాలు పెచ్చురిల్లడంతో మైనార్టీ సముదాయం తీవ్రమైన



ఆత్మరక్షణలో పడింది.

**బక్రీద్ పండుగ రాకతో ముస్లింల ఆత్మావలోకనం:**

ఎన్నికల అనంతరమే బక్రీద్ పండుగ వచ్చి చేరడంతో ముస్లిం సమాజం మరింత ఆందోళన,ఆదుర్దా చెందింది. పండుగ సందర్భంగా సంప్రదాయ జంతు బలిలో భాగంగా ఈ మారు పశు సంపదను బలిస్తే విద్వేషశక్తుల అరాచకానికి అంతూ పొంతూ ఉండదని ముందుగా ఊహించింది. ఆ అందోళన నుంచే కొత్త వ్యూహం మొగ్గ తొడిగింది. ముస్లిం ఉలేమాలు,పండితులు,ధార్మిక వేత్తలు,ముస్లిం సంఘాలు,జమాతులు కూడ బల్కుకొని.. బక్రీద్ సందర్భంగా ఆవును,ఎద్దును బలిచ్చే సంప్రదాయాన్ని స్వచ్ఛందంగా విరమించాలని తమ సముదాయానికి పిలుపునిచ్చాయి. అల్లరి మూకల దౌర్జన్యాలతో విసిగి వేసారిన మైనార్టీ జనం, ఆవు అరాచకం నుంచి విముక్తిని ఆశిస్తూ పండగ నాడే కాదు.. అన్నీ వేళలా ఏకంగా ఆవు మాంసాన్ని ముట్ట బోమని ప్రతిన బూనారు.

**గో సంరక్షణకు జమాఅతే ఉలేమా సంస్థ మద్దతు :**

వాస్తవానికి ముస్లిం జనసముదానికి మార్గదర్శకం వహించే అతి ప్రాచీన ధార్మిక సంస్థ జమాఅతే ఉలమా హింద్ ఎప్పటి నుంచే సంపూర్ణ గోవధ నిషేధానికి మద్దతు ప్రకటిస్తోంది. ప్రథమ స్వాతంత్రోద్యమ కాలం నుంచే బ్రిటిష్ పాలకుల విభజించు,పాలించు కుటిల నీతిని ఎండగడుతూ ముస్లిం ధార్మిక వేత్తలు గోవధ నిషేధాన్ని సమర్థించారు. ఆపై బ్రీటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటలాన్నీ హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. ఆ ఐక మత్యమే సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకు మార్గం సుగమం చేసింది. ఆపై విభజన రాజాకీయాలు తిరిగి పుంజుకొని ఓ దశాబ్దంగా వికృత రూపం దాల్చాయి. ఈ విద్వేషాలకు అంతానికి హిందూ ముస్లిం ఐక్యతే ఏకైక మార్గమని గత కొంతకాలంగా ముస్లిం ధార్మిక పండితులతో సహా మేధావి వర్గం యోచన చేస్తూనే ఉంది.

**గోవధ నిషేధానికి మౌలానా అర్షద్ మదనీ పిలుపు:**

ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా జమాఅతే ఉలమాఏ హింద్ జాతీయ అధ్యక్షులు,ధార్మిక వేత్త మౌలానా అర్షద్ మదని 'గో' సంరక్షణకు సహ కరించమని, గో వధ మానుకోమని ముస్లిం జన సముదాయానికి పిలుపు నిస్తూ వస్తున్నారు. తద్వారా విద్వేష శక్తులకు అవకాశం చిక్కకుండా ముస్లింలు అప్రమత్తం కావచ్చని బలంగానే సూచించారు. అర్షద్ మదనీ ప్రతిపాదనను మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ స్వాగతించారు. ఆవును మాత్రమే బలివ్వాలనే సూత్రీకరణ ఏ మత గ్రంథంలో లేదని, ఇరుపక్షాల్లో పరస్పర ప్రేమానురాగాలు బలపడేందుకు ప్రత్నామ్నాయ పద్ధతి పాటించాలన్నారు. సంపూర్ణ గో రక్షణ అమలయ్యేలా జాతీయ స్థాయి ఉద్యమం బలపడాలని,ఆవును జాతీయ జంతువుగా గుర్తించే వరకు ఇరు జనసముదాయాలు ఉద్యమాలు నిర్వహించాలని ధార్మిక వేత్త మౌలానా షాబొద్దీన్ రజ్వీ,ఆలిండియా ఖురైషీ జమాత్ అధ్యక్షుడు సిరాజ్ ఖురైషీ, ఇండియన్ ముస్లిం లీగ్ అధ్యక్షులు కౌసర్ హయ్యాత్ ఖాన్ తదితరులు అభిప్రాయపడ్డారు.

**బెంగాల్ ముస్లిం సమాజం సానుకూల స్పందన:**

మొత్తంమీద ధార్మిక వేత్తల పిలుపును అందుకొని పశ్చిమ బెంగాల్ ముస్లిం ధార్మిక పండిత వర్గం, హిందూ- ముస్లిం మతసామరస్య ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. కలకత్తాలో పేరుగాంచిన ధార్మిక వేత్త మౌలానా ముహమ్మద్ షఫీఖ్ ఖాస్మీ హిందూ-ముస్లిం ఐకతా సందేశాన్ని బలమైన ప్రజా ఉద్యమంగా మల్చారు. దాంతో పశ్చిమ బెంగాల్ మైనార్టీ జనసముదాయమంతా.. ఏకమై స్వాగతించడంతో, దేశం మొత్తం ముస్లిం జనసముదాయం అంతా అదే బాట పట్టింది. జమాఅతే ఉలేమా ఏ హింద్ అధినేత మౌలానా అర్షద్ మదని పిలుపుతో పాటు.. బెంగాల్ మైనార్టీ జన సముదాయం అందించిన స్ఫూర్తి దేశ మంతటా ముస్లిం జనసముదాయాన్ని ఆకర్షించింది. దక్షిణాది రాష్ట్రాల్లో నే కాక, ఉత్తరాది రాష్ట్రాల ముస్లిం జన సముదాయం సంప్రదాయ పశుబలిని ఈ ఏడాది నుంచి విరమించుకుంది.

**సంపూర్ణ గో సంరక్షణ డిమాండ్‌కు పూర్తి మద్దతు:**

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న ముస్లిం సంఘాలు,జమాతులు ఆయా చోట్ల వ్యూహాత్మకంగా.. సంపూర్ణ గోవధ నిషేధం డిమాండ్‌కు విస్తృత ప్రచారం కల్పిస్తున్నాయి. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని నినదిస్తున్నాయి. అవసరమైతే ఈ డిమాండ్ల సాధనకు హిందూ ధార్మిక సంస్థలతో కల్సి ఉద్యమించేందుకు సిద్ధమని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ముస్లిం జనసముదాయం విద్వేష శక్తుల వలకు చిక్కకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో విద్వేష శక్తులకు ఊపిరి సలపని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు పశు మాంసం వినియోగదారులు, కేవలం మైనార్టీ జనసముదాయం కాక పోయినప్పటికీ..పండుగ సదర్భంగా పశు బలి ఆగిపోవడంతో విక్రయ దారులైన హిందూ జనసముదాయం తీవ్రమైన ఆందోళనకు లోనైంది.

**ముస్లింల నిర్ణయంతో స్తంభించిన పశు పోషణ:**

ఏటా పశ్చిమ బెంగాల్ వరకు చూస్తేనే బక్రీద్ పండుగ సందర్భంగా పశు విక్రయాల ద్వారా కోట్ల క్రయవిక్రయాలు జరుగుతాయి. బక్రీద్ పండుగను పురస్కరించుకొని లక్షలాది పశువులు సంతకు తరలించినా, కొనే వారు లేక పోవడంతో తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని పశు పోషకులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు పశువుల పోషణ భారం కావడంతో రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో పశువుల మృత్యువాత గుండెల్ని పిండేస్తుంది. పశు కొనుగోళ్లు నిలిచిపోవడంతో పశు పోషకులకు జరిగే ఆర్థికనష్టం, అసలుకే ఎసరు పెట్టే ప్రమాదం పొంచి ఉండటంతో ఊపిరాడని విద్వేషశక్తులు మరిన్ని కుయుక్తులను తెరపైకి తెస్తున్నాయి.

**తెరపైకి విద్వేష శక్తుల కుయుక్తులు:**

ముంబాయి వంటి మహా నగరాల్లో పౌర శాంతికి విఘాతం కల్గించే రీతిలో విద్వేష శక్తులు దుందుడుగా వ్యవహరిస్తున్నాయి. మనస్సు మార్చుకున్న ముస్లింలు మేకను బలిస్తే.. అందుకు ప్రత్యామ్నాయంగా కాలనీల్లో పందులను కోస్తామని రెచ్చగొడుతున్నాయి. గోరక్షకుల ముసు గులో కొంత మంది విద్వేష కారులు గోవధ నిషేధంపై అత్యవసర ఆదేశాలు కోరుతూ దేశ అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. పండుగకు గంటల ముందు కాలవ్యవధిలో తాజా ఉత్వర్వులు కోరడంపై ధర్మాసనం చివాటు పెట్టి పిటిషన్‌ను తోసిపుచ్చింది. పశు బలి విషయమై ముస్లిం సమాజం దశాబ్దాల సంప్రదాయాన్ని కాదని హిందూ- ముస్లిం ఐక్యత దిశగా వేస్తున్న అడుగులు విద్వేష శక్తులను హడలెత్తిస్తున్నాయి. గో వధ నిషేధం ద్వారా హిందూ - ముస్లిం ఐక్యత బలపడితే తమ ఉనికికే ప్రమాదంగా తలపోస్తున్నాయి.

**గో రాజకీయం చే జారితే అసలుకే ఎసరు:**

రానున్న కొద్ది నెలల వ్యవధిలో దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తర్ ప్రదేశ్‌లో ఎన్నికల నగరా మోగనుండటంతో విద్వేష శక్తులు మరింతగా బెంబేలు పడి పోతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎన్నికల్లో ఆయాచిత లబ్ధికి ఉపయుక్తంగా ఉన్న 'గో' రాజకీయం చేజారితే అసలుకే ఎసరు రావచ్చని తలపోస్తున్నారు. వాస్తవానికి ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రమే 'గో' మాంసం ఎగుమతిలో అగ్ర స్థానంలో ఉంది. గో మాంసం ఎగుమతి దారులందరూ దాదాపు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన హిందూ వాణిజ్య వేత్తలే. ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మొత్తం బీఫ్ ఎగుమతి దారుల్లో భారత్ దేశం ఒకటి. బీఫ్ ఎగుమతుల్లో అగ్రస్థానానికి ఎగబాకేందుకు తరుచూ బ్రెజిల్‌తో పోటీ పడుతుంది. ప్రత్యేకించి గత రెండో విడిత ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీఫ్ ఎగుమతుల్లో భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది.

**ఏటా 16 లక్షల టన్నుల గోమాంసం ఎగుమతి :**

మనదేశం నుంచి ఏటా 16 లక్షల టన్నుల పశుమాంసం మధ్యప్రాశ్చ దేశాలతో పాటు, ఈజిప్ట్ ఇండోనేషియా దేశాలకు ఎగుమతి అవుతుంది. ఇవన్నీ ఇస్లామిక్ సంప్రదాయ దేశాలు కనుక మాంసం వినియోగమై ప్రాథమికంగా పాటించే హలాల్ పద్ధతిలోనే ఎగుమతి ప్రక్రియ పక్కాగా ప్రభుత్వ అనుమతులతోనే జరుగుతుంది. ముస్లిం దేశాలతో ఎగుమతి వ్యవహారం కనుక బీఫ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలన్నీ అరబ్బిక్ పేర్లను పోలిఉంటాయి. ఇదీ లాభసాటి వ్యాపారం కావడంతో దజనుకు పైగా హిందూ వాణిజ్య వేత్తలు అరబ్బీ పేర్లతో ఎగుమతి కంపెనీలు నడుపుతున్నారు. ఉదాహరణకు అల్‌కబీర్ లిమిటెడ్ కంపెనీ అధినేత సతీష్ సబర్వాల్,కాగా సునీల్ కపూర్ అరేబియన్ ఎక్స్‌పోర్ట్ ఓనర్. సునీల్ సూద్‌ది అల్‌నూర్ ఎక్స్‌పోర్ట్,ఈరాన్ బీఫ్ లిమిటెడ్ యజమాని నితిన్ శర్మ. విచిత్రం ఏమిటంటే జీవహింసకు ఆమడ దూరంగా ఉండే జైనులు సైతం బీఫ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీల్లో పాట్నర్లుగా ఉండటం కొసమెరుపు. దేశీయంగా పశుమాంసంపై నానాయాగీకి చేస్తున్న పాలక పార్టీలు బీఫ్ ఎక్స్‌పోర్టర్ల నుంచి ఎలక్ట్రోరల్ బాండుల క్విడ్‌ప్రోకో ఉందనే విమర్శలూ లేక పోలేదు.

**సమయస్ఫూర్తితో నిఖార్సయిన నిర్ణయం:**

బీఫ్ వినియోగం,విదేశీమారకం,ఎగుమతులో తెరచాటు నిజాలు నిబ్బరంగా ఉన్నా.., దేశీయంగా బీఫ్ రాజకీయాల్లో ముస్లిం జనసముదాయమే బలిపశువుగా నిలబడుతుంది. కోట్లల్లో జరుగుతున్న బీఫ్ ఎగుమతులకు పచ్చ జండా ఊపే పాలక పార్టీలు దేశీయంగా జరిగే పశుమాంసం వినియోగంపై కుట్రలు, కుతంత్రాలతో అధికార సౌధాలు నిర్మిస్తున్నాయి. పండగలకు పబ్బాలకు జరిగే సంప్రదాయ వినియోగాన్ని నానా రభస చేయడం కేసులు కట్టి వేధింపులకు గురిచేయడం.., అల్లరి మూకలకు ఉతమివ్వడంతో మూకదాడులకు అవకాశ మివ్వడం ఇవ్వన్నీ తాజా పరిస్థితుల నేపథ్యంలో బాధిత ముస్లిం సమాజాన్ని లోతుగా ఆలోచించే అవకాశం ఇచ్చాయి.

బీఫ్ నిషేధం పట్ల ముస్లిం ధార్మిక వేత్తలు,పండితుల పిలుపు,ధార్మిక గ్రంథాల వెలుగులో వాళ్లు కల్గించిన ప్రేరణ ముస్లిం సమాజానికి సరైన సమయంలో, నిఖార్సయిన నిర్ణయం తీసుకునే దిశగా ప్రేరేపించాయి. గో సంరక్షణ చిత్తశుద్ధితో అమలు జరపడానికి ఐక్యతా దిశగా అడుగులు వేయాలని, బీఫ్ ఛోడో-దిల్ జోడో ఉద్యమాన్ని చివరకంటూ కొనసాగించాలని నిర్ణయించుకున్నాయి.



# రేర్ మినరల్స్ పై దృష్టి

**- 20 బిలియన్ డాలర్ల సమీకరణకు ఓకే**
**- క్వాడ్ దేశాల నిర్ణయం**
**- భారత్ లోని ముఖ్యఖనిజాలపై అమెరికా కన్ను**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్రీకృత ప్రపంచ సరఫరా నెట్‌వర్క్‌లపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఆర్థిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా క్వాడ్ దేశాలు (భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్) కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రభుత్వ, ప్రయి వేట్ పెట్టుబడుల రూపంలో కీలక ఖనిజాల సరఫరా గొలుసులను బలోపేతం చేయడానికి 20 బిలియన్ డాలర్ల వరకు సమీకరించేందుకు ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను ఆవిష్కరించాయి. ఈ మేరకు భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ సంయుక్తంగా 'క్వాడ్ క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ ఫ్రేమ్‌వర్క్'ను విడుదల చేశాయి.

**ఫ్రేమ్‌వర్క్‌లో కీలక అంశాలు**

ఈ ఫ్రేమ్‌వర్క్ అధునాతన సాంకేతికతలు, స్వచ్ఛ ఇంధన వ్యవస్థలు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, టెలీ కమ్యూనికేషన్లు, రక్షణ రంగ తయారీకి అవసరమైన కీలక ఖనిజాల తవ్వకం, శుద్ధి, పునరుద్ధరణలో సహకారానికి ఒక విస్తృతమైన మార్గసూచిగా మారనుంది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత, ఇంధన సమస్యలపై క్వాడ్ విదేశాంగ మంత్రులు ఢిల్లీలో సమావేశమై చర్చలు జరిపిన అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది.

**ఢిల్లీలో క్వాడ్ సమావేశం**

కాగా, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో క్వాడ్ విదేశాంగ మంత్రులు సమావేశం మంగళవారం జరిగింది. ఈ మీటింగ్‌లో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాకు చెందిన విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ప్రపంచ ఇంధన పరివర్తన, ఉన్నత సాంకేతిక పరిశ్రమలకు కీలకమైన లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్ వంటి అరుదైన ఖనిజాల లభ్యతకు సంబంధించి సరఫరా గొలుసులోని బలహీనతలు, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ పోటీపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో 'క్వాడ్ క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ ఫ్రేమ్‌వర్క్'ను నాలుగు దేశాలు విడుదల చేశాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ కింద క్వాడ్ భాగస్వాములు ఆర్థిక విధాన సాధనాలు, వ్యూహాత్మక పెట్టుబడులు ద్వారా సురక్షితమైన, వైవిధ్యమైన, న్యాయమైన ఖనిజ మార్కెట్ల అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రభుత్వ మద్దతుగల ఆర్థిక యంత్రాంగాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ద్వారా 20 బిలియన్ డాలర్ల వరకు సమీకరించాలనే ప్రతిపాదన ఈ చొరవలో ఒక ప్రధానాంశంగా ఉంది. రుణ సాయం, హామీలు, బీమా, ఈక్విటీ భాగస్వామ్యం, వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం వాణిజ్య ఆఫ్టేక్ ఏర్పాట్లు ఉండవచ్చని ఫ్రేమ్‌వర్క్ తెలియజేస్తోంది.

**క్వాడ్ నెక్సస్‌కి మద్దతు**

క్వాడ్ దేశాలు 'క్వాడ్ నెక్సస్' ఉన్న ప్రాజెక్టులను గుర్తించి, వాటికి మద్దతు ఇవ్వాలని కూడా యోచిస్తున్నాయి. ఈ చొరవ ప్రపంచ కీలక ఖనిజ సరఫరా గొలుసులలో అధిక కేంద్రీకరణను తగ్గించడంతో పాటు, ఇండో-పసిఫిక్ ప్రాంతమంతటా పారిశ్రామిక స్థితిస్థాపకతను బలోపేతం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఫ్రేమ్‌వర్క్ నియంత్రణా సమన్వయం, జాతీయ భద్రతా రక్షణ చర్యలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఈ ఫేమ్‌వర్క్‌లో అనుమతులు, లైసెన్సింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, జియోగ్రాఫికల్ మ్యాపింగ్, వనరుల అంచనాలో సాంకేతిక నైపుణ్యాన్ని పంచుకోవడం వంటి విషయాలలో తాము సహకరించుకుంటామని క్వాడ్ సభ్యదేశాలు తెలిపాయి. అయితే అమెరికా ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారటం..ప్రత్నామ్యాయ దేశాల్లోని ఖనిజాలవైపు అమెరికా కన్నేసింది. అందులో భాగంగానే అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రోబియో ఢిల్లీలోనే మకాం వేసి అన్ని అగ్రిమెంట్లు దగ్గరుండి చేయించుకుంటున్నారు. భారత్ ను ఎలా తమవైపు మలుచుకుంటున్నాడో.. సమగ్రవివరాలన్నీ వైట్ హౌస్ బాస్ కు కబురందిస్తున్నట్టు సమాచారం

## గ్రామ పంచాయతీ సిబ్బందికి

# ఒకటో తారీఖునే జీతాలు

(మొదటి పేజీ తరువాయి)
అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా జీతాలు అందాలన్నారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలన్నారు. స్వంత ఆదాయంపై గ్రామపంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ఆసరా పింఛన్ల ప్రస్తుత విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని సీఎం ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందేలా ఓటర్ ఐడీ, ఆధార్, సీపెక్ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలని సూచించారు. కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్ష?లో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీరాజ్ ప్రతేక కార్యదర్శి దానకిషోర్, కమిషనర్ డి.దివ్య దేవరాజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ కస్టడీకి

# బండి భగీరథ్

హైదరాబాద్– సూర్య వాస్తవం

మైనర్ బాలికపై లైంగికదాడికి సంబంధించి పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సజంయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ జిల్లా కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరురోజులపాటు తమకు అప్పగించాలంటూ నాలుగు రోజుల క్రితం సిట్ అధికారులు కోర్టులో ఫిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సిట్ పిటిషన్‌పై విచారించిన కోర్టు బుధవారం నుంచి పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం ఆయన్ను చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. కూకట్‌పల్లిలోని సిట్ కార్యాలయంలో రీతూరాజ్ నేతృత్వంలో దర్యాప్తు బృందం విచారించనుంది. ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం రూపొందించింది. మైనర్ బాలికపై లైంగికదాడితోపాటు వారి మధ్య జరిగిన ఫోన్ చాటింగులను భగీరథ్ డిలీట్ చేయడం, బాలికకు రూ. 50వేలు ఇచ్చాను అని ఆయన చేసిన ప్రకటనపై సిట్ మరింత లోతుగా విచారించనున్నట్టు తెలిసింది. లైంగికదాడి ఆరునెలల క్రితం జరిగినట్టు భగీరథ్ పేర్కొంటున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఆధారాలను సేకరించనుంది. మైనర్ బాలిక తల్లి వాగ్మూలాన్ని పూర్తిగా క్రోడికరించి, భగరీథ్ నుంచి అదనపు సమాచారాన్ని , నిజాలను వెలికి తీసేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మొత్తం మీద సిట్ అధికారుల విచారణలో నిందితుడు ఏమేరకు అంగీకరిస్తారనే కోణంలో ఇటు రాజకీయ వర్గాలు, అటు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో చూడాల్సిందే.

## నేటి నుంచి

# టిడిపి మహానాడు

- కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న అధినేత చంద్రబాబు
- పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లిపొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు
- క్లస్టర్ల వారీ వర్చువల్‌గా పాల్గొననున్న శ్రేణులు

అమరావతి – సూర్య వాస్తవం

తెలుగుదేశం పార్టీ కార్యక్రమం 'మహానాడు' బుధవారం నుంచి రెండు రోజులపాటు నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. ఈ మహానాడులో 20 తీర్మానాలు చేపట్టనున్నారు. వీటిల్లో రాష్ట్రానికి సంబంధించినవి 10, తెలంగాణకు సంబంధించినవి 4, అండమాన్‌కు సంబంధించినది ఒక తీర్మానం ఉన్నాయి. ఇక ఉమ్మడిగా 4 తీర్మానాలతో పాటు.. చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానం ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది మహానాడును స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించుకున్న క్రమంలో మహానాడు వేదికగా జరగబోయే ప్రసంగాలు మహిళా శక్తి కేంద్రీకృతంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో శ్రేణులను ఆ దిశగా సమాయత్తం చేయనున్నారు. మంత్రి నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత జరుగుతోన్న తొలి మహానాడు కావడంతో ఆయన ఏం ప్రసంగిస్తారు.. ఎలాంటి దిశా నిర్దేశం చేస్తారనే ఆసక్తి అందరిలోనూ కన్పిస్తోంది. ఈసారి మహానాడు ఫిజికల్‌గానూ.. వర్చువల్ పద్ధతిలోనూ జరగనుంది. వర్చువల్ పద్ధతిలో క్లస్టర్ల వారీ నిర్వహణకు 1,800కు పైగా క్లస్టర్లల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**తొలిరోజు కార్యక్రమాలు ఇవే..**

మహానాడు తొలి రోజున టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదయం 9 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్తారు. సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రారంభ ఉపన్యాసంతో కార్యక్రమం మొదలవుతుంది. ఆ తర్వాత పార్టీ పద్దులను వివరిస్తారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తారు. స్త్రీ శక్తి, కార్యకర్తే అధినేత, పేదల సేవలో వంటి అంశాలపై నేతలు ప్రసంగిస్తారు. వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. సాయంత్రం 6 గంటలకు మొదటిరోజు కార్యక్రమం ముగుస్తుంది. రెండో రోజు 28న ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పిస్తారు. తెలుగుజాతి విశ్వఖ్యాతి, గతంలో పార్టీ చేసిన పోరాటాలు, అన్నదాతకు అండగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించే సాయం, నా దేశం... నా బాధ్యత, ఆధ్యాత్మికాంధ్ర, మౌలిక సదుపాయాల కల్పన, శాంతిభద్రతలు, విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం, సంపద సృష్టి వంటి అంశాలపై చర్చించి.. తీర్మానాలను ఆమోదిస్తారు. చివరిలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో రెండు రోజుల మహానాడు ముగుస్తుంది.

# బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీక

**పులివెందుల– సూర్య వాస్తవం : ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా,భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో 'బక్రీద్' ఒకటి. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జుల్ హిజ్జా నెల 10వ రోజున ఈ పండుగను జరుపుకుంటారు. సమాజంలో సమానత్వాన్ని,త్యాగ నిరతిని చాటిచెప్పడమే ఈ పండుగ యొక్క ముఖ్య ఉద్దేశం.**



**బక్రీద్ నేపథ్యం -- చారిత్రక విశిష్టత**

బక్రీద్ పండుగ వెనుక ఒక గొప్ప త్యాగపూరిత చరిత్ర ఉంది. అల్లాహ్ (దేవుడు) ప్రవక్త అయిన ఇబ్రహీంను పరీక్షించాలనుకున్నాడు. అందులో భాగంగా ఆయనకు అత్యంత ప్రియమైన వస్తువును త్యాగం చేయాలని కల ద్వారా ఆదేశించాడు. ఇబ్రహీం తనకు డెబ్బై ఏళ్ల వయసులో పుట్టిన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్‌ను అల్లాహ్ కోసం బలి ఇవ్వడానికి సిద్ధపడ్డారు. తండ్రి ఇష్టాన్ని దైవాజ్ఞగా భావించి కుమారుడు కూడా సంతోషంగా ప్రాణత్యాగానికి అంగీకరించాడు. ఇబ్రహీం తన కుమారుడి గొంతుపై కత్తి పెట్టబోతుండగా,వారి నిశ్చల భక్తికి,త్యాగానికి అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు. ఇస్మాయిల్ స్థానంలో ఒక జీవాన్ని (గొర్రె లేదా మేక) ఉంచి, ఆ బలిని స్వీకరించాడు. ఈ ఘటన మానవ ప్రాణాల బలిని నిరోధించి,కేవలం దైవం పట్ల ఉన్న భక్తిని,విశ్వాసాన్ని నిరూపించడానికి ప్రతీకగా నిలిచింది. ఆ త్యాగాన్ని స్మరిస్తూనే ప్రతి ఏటా బక్రీద్ పండుగను జరుపుకుంటారు. బక్రీద్ రోజున ముస్లింలు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి ఈద్గా లేదా మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ప్రపంచ శాంతి, సోదరభావం కోసం దువా (ప్రార్థన) చేస్తారు. ప్రార్థనల అనంతరం మేక, గొర్రె లేదా ఇతర పశువులను 'కుర్బానీ' (బలి) ఇస్తారు. కుర్బానీ ఇచ్చిన మాంసాన్ని మూడు సమాన భాగాలుగా విభజిస్తారు. మొదటి భాగం పేదలకు, నిరుపేదలకు పంచుతారు. రెండవ భాగం బంధువులు, స్నేహితులకు ఇస్తారు. మూడవ భాగం తమ కుటుంబం కోసం ఉంచుకుంటారు.

**బక్రీద్ ఇచ్చే సందేశం**

బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానాన్ని నేర్పుతుంది. సమాజంలో ఉన్న పేదవాడు కూడా పండుగ రోజున ఆకలితో ఉండకూడదనే ఉదాత్తమైన ఆశయం ఇందులో ఉంది. దైవ నిర్ణయానికి లోబడి జీవించడం, స్వార్థాన్ని, అహంకారాన్ని వదులుకోవడమే నిజమైన త్యాగమని ఈ పండుగ చాటిచెబుతుంది. ఈ పండుగ మానవాళికి శాంతి,కరుణ, మరియు పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని సందేశాన్ని ఇస్తుంది.

# పొలం నుండి ఇంటికి...

(మొదటి పేజీ తరువాయి)
వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ వ్యయంతో వినియోగదారుల ఇళ్ళ వద్దకు చేరేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పిఎండిఎస్ -- హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రకృతి సేద్యం సహా ఎన్‌ఎంఎన్‌ఎఫ్ పథకం అమలు కోసం కేంద్రానికి లేఖలు రాయాలని నిర్దేశించారు. కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏ మేరకు తగ్గించగలిగామో అంచనా వేయాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సూక్ష్మపోషకాల వినియోగం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణపై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలు చేస్తున్నామని, మరో రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా రానున్నాయని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జూలైలో మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. పశుదాణాతో పాటు సైలేజ్‌ను తక్కువ వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

**బ్లూ ఎకానమీగా ఆక్వారంగం అభివృద్ధి**

ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సీడి ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని స్పష్టం చేశారు. సముద్ర తీరంలో మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం రూ.240 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు సిఎంకు వివరించారు. బ్లూ ఎకానమీ దిశగా ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 90 నియోజకవర్గాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సిఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

# ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకే..

- కర్ణాటక కాంగ్రెస్ ప్రక్షాళనకు అధిష్ఠానం కసరత్తు
- ఢిల్లీ చేరిన సిద్ధరామయ్య, డీకే శివకుమార్
- ఖర్గే నివాసంలో నేడు కీలక భేటీ
- కర్ణాటక లీడర్‌షిప్ మార్పుపై ముమ్మర చర్చలు
- త్వరలో రాజ్యసభ, మండలి స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో, పార్టీ శ్రేణుల్లో భారీ మార్పులు చేపట్టేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో రాహుల్ గాంధీ సమక్షంలో జరిగే కీలక భేటీలో ఈ మార్పులపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ఇప్పుడే ఎందుకు?**

రాష్ట్రంలో పాలనను మరింత పటిష్ఠం చేయడానికి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా చేరవేయడానికి ఈ మార్పులు అవసరమని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి ప్రభుత్వంపై ఎలాంటి వ్యతిరేకత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే దీని ఉద్దేశమని తెలుస్తోంది. మరోవైపు పొరుగు రాష్ట్రమైన కేరళ ఎన్నికలు ముగిసిన తర్వాత కర్ణాటక నాయకత్వ మార్పు అంశాన్ని పరిశీలిస్తామని గతంలో డీకే శివకుమార్‌కు పార్టీ పెద్దలు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇప్పుడు కర్ణాటకపై అధిష్ఠానం దృష్టి సారించినట్లు సమాచారం.

**మూడు ప్రధాన వ్యూహాలు?**

**కేవలం మంత్రివర్గ ప్రక్షాళన**

మొదటి వ్యూహం ప్రకారం సిద్ధరామయ్యనే సీఎంగా కొనసాగిస్తూ మంత్రివర్గంలో భారీ మార్పులు చేసే అవకాశం ఉందని సమాచారం. సరిగ్గా పనిచేయని మంత్రులను తొలగించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అహిందా (మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, దళితులు) సామాజిక వర్గాలకు పెద్దపీట వేయాలని భావిస్తున్నట్లు వినికిడి. డీకే శివకుమార్ సూచనలకు అనుగుణంగా ఈ మార్పులు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**సీఎంగా డీకే శివకుమార్?**

రెండో ప్రతిపాదన ప్రకారం రాష్ట్రంలో నాయకత్వ మార్పు చేపట్టవచ్చని ప్రచారం జరుగుతోంది. డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించి, సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపేలా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. 2023లో ప్రభుత్వం ఏర్పాటైనప్పుడే రెండున్నరేళ్ల తర్వాత సీఎం సీటు ఇస్తామని శివకుమార్‌కు అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈ మార్పు జరిగితే ఇరు వర్గాల నేతలతో కొత్త మంత్రివర్గాన్ని కూర్చవచ్చని తెలుస్తోంది.

**తెరపైకి మల్లికార్జున ఖర్గే?**

ఒకవేళ సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వర్గాల మధ్య తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడితే ఏకాభిప్రాయ అభ్యర్థిగా మల్లికార్జున ఖర్గేను రంగంలోకి దించే అవకాశాలూ లేకపోలేదని పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రి కావాలనేది ఖర్గే సుదీర్ఘకాల స్వప్నమని సమాచారం. అయితే ఆయన్ను ఢిల్లీ నుంచి రాష్ట్రానికి పంపితే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వ నిర్మాణాన్ని పునఃసమీక్షించాల్సి వస్తుంది కాబట్టి ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడం అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**రాజ్యసభ, కౌన్సిల్ ఎన్నికల హడావుడి**

మరోవైపు రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు, తొమ్మిది శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభ నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కావడం వల్ల అభ్యర్థుల ఎంపికపై కూడా ఢిల్లీలో కసరత్తు చేయనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీకాలం పూర్తి చేసుకున్న తరుణంలో డీకే శివకుమార్ అనుచరులు సీఎం పదవి కోసం ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగే ఢిల్లీ భేటీలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# మోడీ 12ఏళ్ల పాలనా కాలం
# ఒక చీకటి కాలం, రాహుకాలం

- కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోయర్ల సంఖ్య ఇందుకు నిదర్శనం
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవి పగ్గాలు చేబట్టి ఈరోజుకి అనగా మే 26వ తేదీకి సరిగ్గా 12 సంవత్సరాలు పూర్తి అయింది. ఈ 12 సంవత్సరాల మోడీ పాలనా కాలం భారతదేశ చరిత్రలో ఒక చీకటి యుగమని, రాహుకాలం అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ 12 సంవత్సరాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని అన్నారు.

భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ప్రధాన దేశమని, ఇటువంటి దేశంలో మోడీ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందని, రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, ఉద్యోగాలు,ఉపాధి లేక నిరుద్యోగులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు డీజిలు, వంట గ్యాస్,ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యులకు అందుబాటులో లేవని అన్నారు. మోడీ ప్రభుత్వం వాతల ప్రభుత్వంగా తయారైందని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. సిబిఐ, ఈడి, ఐటి, ఎలక్షన్ కమిషన్,తదితర రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని,దుర్వినియోగం అయ్యాయని అన్నారు.మోడీ ప్రభుత్వం లీకుల ప్రభుత్వంగా, రద్దుల ప్రభుత్వంగా తయారైంది.

మోడీ పాలనలో దాదాపు 89 సార్లు పరీక్ష పత్రాలు లీకయ్యాయని, దాదాపు 40 సార్లు పరీక్షలు రద్దు అయ్యాయని పేర్కొన్నారు.నీట్ లాంటి ప్రతిష్టాత్మక పరీక్షల పత్రాలు కూడా లీక్ కావడం,పరీక్ష రద్దు కావడం శోచనీయం. మోడీ పాలనా కాలంలో డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోయింది. దేశం అప్పుల భారత్ అయింది.

1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాలలో భారత ప్రభుత్వం 45 లక్షల కోట్లు రూపాయలు అప్పు చేయగా కేవలం 12 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం అదనంగా 155 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం తలసరి ఆదాయంలో 142 వ స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో, మానవాభివృద్ధి సూచికలో 130 వ స్థానంలో, సంతోష సూచికలో 144 స్థానంలో ఉండడం అత్యంత గర్హనీయం. మోడీ 12 ఏళ్ల పాలనలో దేశ రాజధాని ఢిల్లీ నగరం కాలుష్యం కారణంగా జీవించడానికి యోగ్యము కాని

స్థాయికి చేరుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం మీద అసంతృప్తి, అసమ్మతి తెలియజేసేటందుకు ఏర్పాటు అయిన సోషల్ మీడియా కాక్రోచ్ జనతా పార్టీకి కేవలం 7 రోజుల్లో 2 కోట్ల మంది ఫాలోయర్లు వచ్చారు. మోడీ ప్రభుత్వం పై ఏ స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి ఉందో దీన్ని బట్టి తెలుస్తోంది. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకొని రాబోవు మూడు సంవత్సరాలలోనైనా సుపరిపాలన అందించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. లేకుంటే 2029 లోక్ సభ సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం ఘోరమైన ఓటమిని చవి చూడక తప్పదని తులసి రెడ్డి హెచ్చరించారు.

## శాంతియుత వాతావరణంలో
## బక్రీద్ పండుగ జరుపుకోవాలి

- డీఎస్పీ మురళి నాయక్



**పులివెందుల - సూర్య వాస్తవం :** సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ బక్రీద్ పండుగను శాంతి యుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పులి వెందుల డిఎస్పి మురళి నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మురళీ నాయక్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశా భావాన్ని వ్యక్తం చేస్తూ,. అన్ని మతాలకు సంబంధించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ముఖ్యంగా జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాల న్నారు. ఎలాంటి మతపరమైన, సున్నితమైన అంశాలను సూక్ష్మ దృష్టిలో చూడకుండా.. అన్ని మతాల ప్రజలుసహనం,సంయమనంతో సంతోషంగా. సాంప్రదాయాలను గౌరవించు కుంటూ బక్రీద్ పండుగ ను నిర్వహించుకోవాలన్నారు. అందులో భాగంగానే అన్ని మతాల చెందిన యువకులకు బక్రీద్ పండుగ నిర్వహణ, సంప్రదాయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలంలో కూడా పీఎస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి.. సంబందిత పంచాయతీ,రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ పరిధిలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న
## వైసీపీ నేతను పరామర్శించిన వైఎస్ మధు



**తొండూరు - సూర్య వాస్తవం :** తొండూరు మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వైకాపా మండల పరిశీలకుడు బండి రామముని రెడ్డిని మంగళవారం తొండూరు మండల వైకాపా ఇంచార్జి వైఎస్ మదన్మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైకాపా మండల కన్వీనర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి,జింకా అశ్విని కుమార్,దాసరి గంగరాజు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో రామముని రెడ్డిని కుటుంబ సభ్యులు వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ
## బడులలో చేర్పించండి

- వారి ఉజ్వల భవిష్యత్తుకు సహకరించండి
- అవగాహన ర్యాలీలో ఎంఈఓ




**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రామంలో ఎంఈఓ ఖాదర్ భాష, ప్రధాన ఉపాధ్యాయులు ప్రభు కుమారు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పేరెంట్స్‌తో కలసి మంగళవారం ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ బడలపై అవగాహన కల్పిస్తూ నలుగురు విద్యార్థులను జిల్లా పరిషత్ హైస్కూల్ సింహాద్రిపురం నందు చేర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం అనేది వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం వంటిది అని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన, మరియు ఉచిత సదుపాయాలపై తల్లిదండ్రులలో విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ తరగతులు, మౌలిక వసతులను కల్పిస్తూ.. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ బడుల్లో చేరేలా అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హంద్రీ కాలువ గట్టుపై మట్టి అక్రమ రవాణా

- పట్టించుకునే నాధుడే లేడు అంటూ రైతుల ఆవేదన



**వజ్రకరూరు - సూర్య వాస్తవం :** మండలం పరిధిలో హంద్రీనీవా ప్రధాన కాలువ గట్ల నుంచి మట్టిని కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం, పొట్టిపాడు, రహదారి సమీపంలోని కొనకొండ్ల పరిసరాలు. పొక్లెయిన్ల సాయంతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలోకి ఎక్కించి తరలిస్తున్నారు. ఇప్పటికే వందల ట్రిప్పుల మట్టిని తరలించడం వల్ల దాదాపు 50 అడుగుల ఎత్తు ఉన్న కాలువ గట్టు కరిగిపోతోంది. దీనివల్ల కాలువ గట్లు బలహీనపడి భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మట్టిని బహిరంగ మార్కెట్లో భారీ ధరలకు అమ్ముకుంటున్నారు. ట్రాక్టరు మట్టి రూ. 1,000 దూరాన్ని బట్టి ధర మరింత పెరుగుతుంది టిప్పర్ మట్టి రూ. 3,000 దూరాన్ని బట్టి ధర మరింత పెరుగుతుంది.

**అభివృద్ధి ముసుగులో అక్రమాలు**

ఉరవకొండ ప్రాంతంలో రోడ్లు, ఇతర ప్రభుత్వ నిర్మాణాల పేరుతో గుత్తేదారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని, రాయల్టీ చెల్లించి, అనుమతితో కేవలం కొండలు, గుట్టలు, బం జరు భూముల నుంచి మాత్రమే మట్టిని తీసుకోవాలి. స్థానిక నాయకులు, అధికారులను ప్రసన్నం చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండానే కాలువ గట్లను తవ్వేస్తున్నారు.

**అధికారుల వివరణ**
**(శ్రీనివాసనాయక్, హంద్రీనీవా ఈఈ)**

ఈ అక్రమ తవ్వకాలపై హంద్రీనీవా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసనాయక్ స్పందిస్తూ క్రింది విషయాలను తెలిపారు. మట్టి తరలింపు అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కాలువపై కాపలాదారులు లేకపోవడం వల్లే ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల తో నిఘా పెంచుతాం. మట్టిని అక్రమంగా తరలించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఏ సమస్య తలెత్తిన తమ దృష్టికి వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పెద్దరంగాపురం గ్రామం నందు మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి గ్రామస్థులతో కలిసి పర్యటించారు, గ్రామం లో నెలకొన్న సమస్యలను వైయస్ మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు, పెండింగ్‌లో ఉన్న యూజీడి పనులను, సీసీ రోడ్లను పరిశీలించి ఎంపీ అవినాష్ రెడ్డి తో మాట్లాడి పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు,ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, వైసీపీ నాయకులు రాజుల పురుషోత్తం రెడ్డి, డీలర్ వెంకట్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు వెన్నపూస రామకృష్ణ రెడ్డి, చంద్ర, అంకాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మసీదు ముత్తవలి రౌఫాను
## పరామర్శించిన మాజీ సర్పంచ్



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లె మర్కస్ మసీదుకు చెందిన ముత్తవలి, మైనార్టీ నాయకుడైన అబ్దుల్ రౌఫాను మాజి సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వైసీపీ యవనేత రోహన్ నాగిరెడ్డిలు పరామర్శించారు. ఇటివల కాలంలో మసీదు ముత్తవలి ఆర్ ఎంఎస్ అబ్దుల్ రౌఫా ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరగడం జరిగింది. దీంతో కర్నూలు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని వేంపల్లెలోని తన స్వగృహంలో విశ్రాంత తీసుకోవడం జరిగింది. ఈ సంఘటన విషయం తెలియ డంతో మంగళవారం మసీదు ముత్తవలి అబ్దుల్ రౌఫా ఇంటికి మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వైసీపీ యవనేత రోహన్ నాగిరెడ్డిలు వెళ్లి పరామర్శించారు. అలాగే ఘటనపై కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకొని రౌఫా ఆరోగ్యంగా ఉండేందుకు కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముత్తవలిని పరామర్శించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ మునీర్, వైసీపీ నేత భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# టీడీపీ మహానాడు పండుగను విజయవంతం చేద్దాం

**- రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ మహానాడు పండుగ సందర్భంగా ఈ నెల 27,28 తేదీలలో రాయచోటి పట్టణంతో పాటు రాయచోటి మండలం,నియోజకవర్గంలోని ఇతర మండలాలలో 11 క్లస్టర్ స్థాయిలో నిర్వహించనున్న మహానాడు పండుగను విజయవంతం చేద్దామని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం అయన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల వ్యవసాయం మార్కెట్ యార్డులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుల పిలుపు మేరకు రాష్ట్ర రవాణా,యువజన,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాలతో రెండు రోజుల పాటు డిజిటల్ విధానంలో అత్యంత వైభవంగా జరగనున్న మహానాడు పండుగ కార్యక్రమా నికి రాయచోటి పట్టణంతోపాటు రాయచోటి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చే సందేశాన్ని తిలకించి, ఆలకించి పార్టీ బలోపేతానికి సమిష్టిగా పని చేయాలన్నారు. ఈ నెల 27 బుధవారం చిన్నమండెం, రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం, మాసాపేట సాయి శుభ కళ్యాణ మండపం,ఫ్రూట్స్ మండేలా సమీపంలోని గఫార్ ఫంక్షన్ హాల్,చిత్తూర్ బైపాస్ రోడ్డులోని అభి ఫంక్షన్ హాల్,చెన్నముక్కపల్లె గ్రామంలోని సుండుపల్లి రోడ్డులో గల నారాయణ కళ్యాణమండపం లలో క్లస్టర్ స్థాయి మహానాడు పండుగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర రవాణా,యువజన,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ఆయన సోదరులు మండిపల్లి లక్ష్మీప్రసాదరెడ్డిలు హాజరవుతారని తెలియజేశారు. కావున ఈ నెల 27,28 తేదీలలో రెండు రోజులపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 11 క్లస్టర్లలో ఆన్లైన్ విధానంలో జరుగు మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి ముఖ్యనాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, గ్రామ,మండల పార్టీ అధ్యక్షులు,టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేఘనాథరెడ్డి, టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి, పుల్లగూర రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఎరుకల నాంచారమ్మకు 13వ వార్షికోత్సవ వేడుకలు

**- ప్రత్యేక అలంకారంలో అమ్మవారు**



**తొండూరు – సూర్య వాస్తవం :** తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత శ్రీ ఎరుకల నాంచారమ్మ 13వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన తదితర పూజా కైకర్యాల అనంతరం ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు,మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు,యువకులు ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మళ్ళీ తెరిచాడా

**- తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం**
**- ఎస్. ఎండి. ఇస్మాయిల్, వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్**



**అనంతపురం – సూర్య వాస్తవం**

అనంతపురంలో రాప్తాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డిని కూటమి ప్రభుత్వం సంబంధం లేని కేసుల్లో అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో రూరల్ మండల పరిధిలోని రైల్వే ట్రాక్‌పై రాప్తాడు నియోజకవర్గానికి చెందిన మహేశ్వర రెడ్డి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అప్పట్లో రైల్వే పోలీసులు అది ఆత్మహత్యేనని నిర్ధారించి కేసు నమోదు చేశారు. అనంతరం ఆ కేసు రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయబడగా, అక్కడి పోలీసులు కూడా అది ఆత్మహత్యేనని నిర్ధారించారు. అయితే, రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఈ ఘటనను ఇప్పుడు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మౌఖిక ఆదేశాలతో తిరగదోడి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం ప్రజాస్వామ్యవాదులందరూ ఖండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తన “రెడ్ బుక్ రాజ్యాంగాన్ని” వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై ప్రయోగించడం సమంజసం కాదని హెచ్చరిస్తున్నాం. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ, రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రజలకు మంచి పరిపాలన అందించలేని కూటమి ప్రభుత్వం, ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీల అమలుపై ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలి. ఇటీవల రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి కల్పించిన గన్‌మెన్ సౌకర్యాన్ని కూడా తొలగించడం చూస్తుంటే, తోపుదుర్తి కుటుంబంపై పెద్ద కుట్ర జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శాసనసభ్యుడిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ భూతాన్ని పూర్తిగా అణచివేసి, ఎక్కడా హింస, రక్తపాతం చోటు చేసుకోకుండా శాంతియుత పరిపాలన అందించారు. ఆయన ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ, తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అటువంటి నాయకుడిని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను వైసీపీ ధైర్యంగా ఎదుర్కొంటుంది. తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డికి చేదోడువాదోడుగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్లే ఈరోజు ఆయనను అక్రమంగా అరెస్టు చేశారని భావిస్తున్నాం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## సంతకొవ్వూరులో వృద్ధురాలు మృతి


**- కుటుంబ సభ్యులను పరామర్శించిన వైసీపీ నేతలు**



**తొండూరు – సూర్య వాస్తవం :** తొండూరు మండల పరిధిలోని సంతకొవ్వూరు గ్రామంలో నివసిస్తున్న వడ్డారపు అచ్చెలమ్మ అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైకాపా మండల ఇంచార్జి వైఎస్ మదన్మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు బండి రామముని రెడ్డి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అచ్చెలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

**- కేసు నమోదు చేసిన పోలీసులు**



**పెద్దవడుగూరు – సూర్య వాస్తవం :** మండల పరిధిలో లక్ష్యంపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. అమ్మవారి వెండి ప్రతిమ, వెండి గొడుగు, బంగారు తాళిబొట్టు.దొగలించినట్లు ఆలయ పూజారి గురుస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తును ప్రారంభించారు. ఇలాంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో దొంగతనాలు జరగడం విచారకరం. పోలీసులు త్వరతగతిన నిందితులను పట్టుకుని, దొంగిలించబడిన అమ్మవారి ఆభరణాలను రికవరీ చేస్తారని ఆశిద్దాం.

## ఆర్టిసి బస్టాండ్‌లో క్లీన్ స్వీప్

**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం ఆర్టిసి బస్టాండ్‌లో ఉదయం 6:45 నిమిషాల నుండి దాదాపు గంట పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన క్లీన్‌స్వీప్ ప్రోగ్రాం కింద బస్టాండ్ పరిసరాల్ని కంట్రోలర్ రామాంజనేయులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగి అనిల్, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్లు వనజ, మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మన బస్టాండు స్వీపర్లతో పాటు మున్సిపల్ సిబ్బంది కూడా క్లీనింగ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని జయప్ర దం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



## జాతీయ స్థాయిలో మెరిసిన పామిడి చిచ్చరపిడుగు హ్రితిక

**- అండర్-18 విభాగంలో హ్రితికకు గోల్డ్**



**పామిడి– సూర్య వాస్తవం:** ఈ నెల 22 నుంచి 24 వరకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 1వ నేషనల్ తైక్వాండో ఓపెన్ ఛాంపియన్ షిప్ ఘనంగా జరిగింది. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ విభూ కృష్ణ, ఐపీఎస్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు తైక్వాండో నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా అమ్మాయిలకు తైక్వాండో వంటి ఒలింపిక్ క్రీడలు ఆత్మరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పోటీలలో అనంతపురం జిల్లా పామిడి పట్టణానికి చెందిన వడగూరు హ్రితిక అద్భుత ప్రతిభ కనబరిచి అండర్–18 కేజీల సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో బంగారు పతకం సాధించింది. పామిడి పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన వడగూరు బాలాజీ జ్యోతి దంపతుల కుమార్తె అయిన హ్రితిక, స్థానిక బ్రూస్లీ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతోంది. అకాడమీ కోచ్ తలారి తులసిరాం ఆధ్వర్యంలో కఠిన సాధన చేసిన హ్రితిక జాతీయ స్థాయిలో విజయం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోచ్ తలారి తులసిరాంను పలువురు అభినందించారు.



## రాళ్ళు రువ్వుకున్న తెలుగు దేశం వర్గీయులు

**- పోలీసుల లాఠీ చార్జి**
**- భారీగా మోహరించిన పోలీసులు**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం :** అధికార తెలుగు దేశం పార్టీకి చెందిన కొందరు బహిరంగంగా బాహాబాహిగా ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు. మంగళవారం సాయంత్రం తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇంచార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఎస్ మాల్ ను తనిఖీ చేసేందుకు వచ్చిన జిల్లా అగ్నిమాపక అధికారి శరత్ బాబు, సిబ్బంది వారి వెంట ప్రవీణ్ కుమార్ రెడ్డి కూడా రావడంతో ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి వర్గం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రవీణ్ కు, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తర్వాత మాట మాట పెరగడంతో ఇరువురు రాళ్ళ దాడికి దిగారు. దీంతో ప్రవీణ్ ఇంటిపైకి వెళ్లేందుకు ఎమ్మెల్యే వరద అనుచరులు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులపై లాఠీచార్జ్ చేశారు. ఎస్ ఎస్ మాల్, ప్రవీణ్ ఇంటి దగ్గర భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజుల నుంచి ప్రవీణ్, ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం విదితమే.

## కుమార్, విజయ్ భాస్కర్ జ్ఞాపకార్థంతో క్రికెట్ టోర్నీ విజేత కేజియన్ జట్టు

### - ముఖ్య అతిథి పాల్యం సుధాకర్



**తనకల్లు - సూర్య వాస్తవం :** శ్రీ సత్య సాయి జిల్లా మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కుమార్ -విజయ భాస్కర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కేజియన్ జట్టు నిలిచింది. స్థానిక క్రీడా మైదానం లో మంగళవారం కుమార్ లెవెన్, కేజీయన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. టాస్ ఓడిపోయిన కేజీయన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. అనంతరం 161 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కుమార్ లెవన్ జట్టు 9 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసి ఓడిపోయారు. విజేతలకు ప్రముఖ రియ ల్టర్ పాల్యం సుధాకర్ రూ. 20 వేలు ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీని అంద జేశారు. అలాగే రన్నర్స్ జట్టుకు మొలకలచెరువు శారద హై స్కూల్, ఆక్స్ఫర్డ్ చైర్మన్ సనత్ కుమార్ రూ. 10 వేలు నగదు, ట్రోఫీని అందించారు. బెస్ట్ బౌలర్‌గా శామీర్, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ నగేష్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కరిముల్లా ఎంపిక య్యారు. వారికి ఆర్గ నైజర్స్ చిన్న, వెంకటేష్, గిరి, యోగి, మబ్బుషా, హరినాథ్‌రెడ్డి, మస్తాన్ షీల్డ్స్‌ను అందజేశారు.

## వృషభాచలేశ్వర ఆలయ అభివృద్ధికి కమిషనర్ హామీ



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లె పాపాగ్ని నది ఒడ్డున వెలసి ఉన్న వృషబాచ లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ కు టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు దేవస్థానం ఛైర్మన్ పివి రమణ తెలిపారు. ఇటీవల వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై టిటిడి పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో భాను ప్రకాశ్ రెడ్డి మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ను కలిసి వినతి పత్రం సమర్పించి దేవస్థానం అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన ఎద్దుల కొండపై ఆలయ ప్రాకారం, తూర్పు- పడమర గాలిగోపురాలు, ఫ్లోరింగ్ నిర్మా ణానికి నిధులు కేటాయించాలని అలాగే ఎద్దులకొండ మధ్య భాగంలో ఉన్న పద్మనాభ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కమిషనర్ కు విన్నవించారు. అలాగే వృషభాచలేశ్వర దేవస్థాన అనుబంధ ఆంజనేయ స్వామి ఆలయంలో నాయి బ్రాహ్మణులను నియమించే చర్యలు తీసుకోవాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించి ఆలయాల అభివృద్ధికి నిధులతో పాటు నాయి బ్రాహ్మణ నియమిస్తామని హామీ ఇచ్చినట్లు భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆలయాల అభివృద్ధికి నిధుల కోసం కమిషనర్‌తో మాట్లాడి అభివృద్ధి కోసం కృషి చేస్తున్న భాను ప్రకాశ్ రెడ్డికి దేవస్థానం తరుపున కృతజ్ఞతలు తెలి నట్లు దేవస్థానం ఛైర్మన్ పివి రమణ తెలిపారు.

## ఘనంగా శ్రీరామాపురం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం





**కమలాపురం - సూర్య వాస్తవం :** కమలా పురం మండలంలోని శ్రీరామా పురం మహా పుణ్యక్షేత్రంలో నిర్జల ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉత్తర ద్వార దర్శనం వైభ వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీ మహా లక్ష్మి మోక్ష నారా యణ స్వామి, శ్రీ వల్లి దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దివ్య దర్శనాన్ని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా పొందారు. ప్రతినెలా ఏకాదశి రోజున ఉత్తర ద్వారాన్ని తెరవడం ఈ ఆలయ ప్రత్యేకతగా కొనసాగుతోంది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెల కొంది. సాయంత్రం శ్రీ మోక్ష నారాయణ స్వామి గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో విహరించగా భక్తులు భజనలు, గోవింద నామస్మరణలతో పాల్గొన్నారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం వల్ల పాప విమోచనం కలిగి సకల శుభాలు, ఐశ్వర్యాలు, ఆరోగ్యం, ఆధ్యాత్మిక పురోగతి సిద్ధిస్తాయని వేద పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఆలయ అధికారులు, అర్చకులు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# పిడుగుపాటుకు యువకుడు బలి

- క్రికెట్ ఆడుతుండగా విషాదం
- కారుమంచివారి కండ్రిగలో కన్నీరుమున్నీరైన కుటుంబం
- అకాల వర్షంతో గ్రామంలో విషాద ఛాయలు
- ఉద్యోగ ఆశలతో ఉన్న యువకుడిని కబళించిన పిడుగు
- కొబ్బరి చెట్టుపై కూడా పిడుగు పడి దగ్ధం



**నాయుడుపేట- సూర్యవాస్తవం:** నాయుడుపేట మండలంలోని జువ్వలపాలెం పంచాయతీ పరిధిలోని కారుమంచి వారి కండ్రిగ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్న పిడుగుపాటు విషాదాన్ని మిగిల్చింది. అకాల వర్షం కురుస్తున్న సమయంలో పంట పొలాల్లో క్రికెట్ ఆడుతున్న యువకులపై పిడుగు పడటంతో ఓ యువకుడు మృతి చెందగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన తొప్పాని రవికుమార్ కుమారుడు యశ్వంత్ (22) తన స్నేహితులతో కలిసి పొలాల్లో క్రికెట్ ఆడుతుండగా అకస్మాత్తుగా భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో పిడుగు పడటంతో యశ్వంత్ అపస్మారక స్థితిలో కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యశ్వంత్ మెకానికల్ డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ కుటుంబానికి అండగా నిలవాలని ఆశపడుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. చేతికొచ్చిన కొడుకు విగతజీవిగా మారడాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించగా గ్రామస్తులు సైతం కంటతడి పెట్టుకున్నారు. యువకుడి ఆకస్మిక మరణంతో కారుమంచివారి కండ్రిగ గ్రామం మూగబోయింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు ప్రయత్నించినా వారి రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. కాగా ఇదే సమయంలో నాయుడుపేట పట్టణంలోని ఎల్.ఏ.సాగరం ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న ఓ కొబ్బరి చెట్టుపై కూడా పిడుగు పడటంతో చెట్టు పూర్తిగా దగ్ధమైంది. అకాల వర్షంతో పాటు పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

# పందుల దొంగల బీభత్సం

- పందుల యజమానిపై బీరు బాటిళ్లతో, రాళ్లతో దాడి
- ఒకరికి గాయాలు, పలు వాహనాలు ధ్వంసం
- బత్తలపల్లి వద్ద దొంగను పట్టుకున్న సీఐ శ్రీరామ్
- పరారీలో ఉన్న మిగతా దొంగలు
- వారిని కూడా అదుపులోకి తీసుకుంటాం అన్న సీఐ శ్రీరామ్



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణములో మంగళవారం తెల్లవారుజామున బులోరా వాహనంలో చందమామ డాబా సమీపంలో కొంతమంది వ్యక్తులు పందులు పడుతున్నారని పందుల యజమాని అంజన్నప్పకు సమీప బంధువు సమాచారం ఇవ్వగా ఈ టైంలో ఇక్కడ ఏం చేస్తున్నారు అని వారిని ఆయన ప్రశ్నించగా అతనిపై సీసాలతో దాడి జరిపారు. వెంటనే అంజన్నప్ప వారి కుమారులు అక్కడికి చేరుకుని వారిని వెంబడించారు. పందుల దొంగలు వారిపై రాళ్లు సీసాలు విసురుకుంటూ వెళుతూ గట్టిగా కేకలు వేస్తూ అధిక స్పీడ్‌తో వాహనం నడుపుకుంటూ వెళ్లారు. వెంటనే అంజన్నప్ప పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. వెంటనే పోలీసులు వారికోసం వెతకడం మొదలుపెట్టారు. వెంటనే అంజన్నప్ప శరవనిలో పోలీసులకు నల్లపురెడ్డి పల్లె మీదుగా వెళ్తున్నారని చెప్పడంతో వారు వెంటనే నల్గొండ వారి పల్లె గ్రామ సమీపంలోని ఒక వ్యక్తికి తెలియజేశారు .ఆ వ్యక్తి మన సొంత వాహనాన్ని అడ్డంగా పెట్టిన పందుల దొంగలు కారును గుద్దుకుంటూ వెళ్లారు. అంబకపల్లి గ్రామం వద్ద గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టారు. రాళ్లను కూడా పందుల దొంగలు లెక్కచేయకుండా బొలెరో వాహనంతో ఎదిరించుకుంటూ వెళ్లారు. దొరిగిల్లు మీదుగా వారు వాహనాన్ని తిప్పారు. గ్రామాలలో ట్రాక్టర్ అడ్డంపెట్టిన కూడా ట్రాక్టర్ను గుద్ది రివర్స్ చేసుకుని ముదిగుబ్బ రూట్ కు వెళ్లారు. కొంతమంది వ్యక్తులు ద్విచక్ర వాహనాలలో వారిని వెంబడిస్తే ద్విచక్ర వాహనదారులను గుద్ధి వాహనం నిలబెట్టకుండా స్పీడ్ గా వెళ్లడంతో పల్లెల్లో ప్రజలందరిని భయభ్రాంతులకు గురిచేస్తూ దొంగలు బీభత్సం సృష్టించారు. అయినా కూడా వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని సీఐ శ్రీరామ్ వారిని వెంబడిస్తూ వెళ్లారు. పోలీసు వాహనానికి పందుల యజమాని వాహనానికి దొరక్కుండా దొంగలు వాహనంపై రాళ్లు, సీసాలు విసురుకుంటూ వెళ్లారు. బత్తలపల్లి సమీపంలో పందుల యజమాని అంజనప్ప వాహనాన్ని వారు తగిలించడంతో వాహనం పూర్తిగా ఒక సైడు అణిగిపోయి తరంగాకుండా అయిపోయింది. ఆ గుద్దినప్పుడు బొలెరో వాహనానికి రెండు టైర్లు ఊసిపోయాయి. పందుల దొంగలు ఇక రండిరా మా బార్డర్ లోకి వచ్చారు మీ కథ చూస్తామంటూ వారిపై రాళ్ళూరవడం మొదలుపెట్టారు. పందుల యజమానులు వాటిని లెక్కచేయకుండా వారిపైకి వెళ్లడంతో కొంతమంది పరుగులు తీశారు. వారిని పోలీసులు వెంబడించారు. కొంతమంది వ్యక్తులు మలమూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తి బండిని ఎక్కి పారిపోయినట్టు అక్కడ ఉన్న వ్యక్తులు తెలిపారు. ఒక వ్యక్తి సీఐ శ్రీరామ్ అదుపులోకి తీసుకొని మిగతా వారి కోసం గాలింపులు మొదలుపెట్టారు. దొంగల బీభత్సవం గురించి లోకల్ పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి పోలీసులు చేరుకుని వారి గురించి విచారణ చేపట్టారు. దొరికిన వ్యక్తిని సీఐ శ్రీ రామ్ అనంతపురానికి తీసుకువెళ్లి మిగతా వారి కోసం ఎంక్వయిరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనాపటికి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇలాంటి దొంగలను కఠినంగా శిక్షించాలని ప్రజల కోరుతున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు పులివెందులలో రెండు మూడు జరిగినట్లు కూడా సమాచారం.

# వైఎస్ కుటుంబ చరిత్ర అంతా దౌర్జన్యాలు, హత్యల మయం

### - టిడిపి నేత భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధ్వజం



**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తాత ముత్తాతల గురించి చెప్తున్నవన్నీ అబద్ధాలని, వారిది దౌర్జన్యాలు, హత్యల చరిత్ర అని తెలుగుదేశం పార్టీ నేత భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ నుండి ఆయన మంగళవారం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి వైఎస్ కుటుంబానికి సంబంధించిన పలు సంచలన విషయాలను ప్రస్తావించారు.

వైఎస్ జగన్ తాత అయిన వైఎస్ రాజారెడ్డి బ్రిటిష్ సైన్యానికి మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేశారని,౽ ండవ ప్రపంచ యుద్ధం సమయంలో జపాన్ బాంబు దాడులకు భయపడి మిలిటరీ నుండి పారిపోయి వచ్చారని ఆరోపించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొనక పోగా,బ్రిటిషర్ల పంచన చేరిన చరిత్ర వారిదని రికార్డులను ఉటంకించారు. 1975లో రైల్వే కోడూరు పరిధిలోని మంగంపేట ముగ్గురాయి గనులను ఆక్రమించుకోవాలనే కుట్రతో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వెంకట నరసయ్యను కడప కోటి సర్కిల్‌లో హత్య చేశారని తెలిపారు. ఈ వ్యవహారంలో కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్ రాజారెడ్డి,వైఎస్ రాజశేఖర్ రెడ్డిలపై కేసు నమోదైన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే కాకముందు నుంచే కడప జిల్లాలో బాంబుల సంస్కృతిని, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. అమాయకుల ఆస్తులను ధ్వంసం చేయడం, పంటలు నాశనం చేయడం ద్వారానే వారు ఆర్థికంగా ఎదిగారని విమర్శించారు. 2005 పులివెందుల మున్సిపల్ మరియు సహకార ఎన్నికల సమయంలో తమ ఇళ్లను డైనమైట్లతో పేల్చివేసి, అక్రమంగా జెండా హత్యల కేసులు మోపి పోలీసులతో అమానుషంగా హింసింపజేశారని రాం గోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు నాడు పులివెందుల మెజిస్ట్రేట్‌ను ప్రలోభపెట్టి తప్పుడు మరణ వాంగ్మూలాలు సృష్టించారని,

దీనిపై తాము సుదీర్ఘంగా పోరాడి సదరు మెజిస్ట్రేట్‌ను 2012లో విధుల్లోంచి డిస్మిస్ చేయించ గలిగామని ఆధారాలతో సహా వివరించారు. వైఎస్ కుటుంబం తమ సొంత సామాజిక వర్గాన్ని లేదా బంధువులైన అవినాష్ రెడ్డి కుటుంబాన్ని కూడా కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకుంటోందని,2014 వరకు వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా అణగదొక్కారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి తానేదో ఫ్యాక్షన్ బాధితుడినని చెప్పుకోవడం హాస్యాస్పదమని, నిజానికి తామంతా వైఎస్ కుటుంబ ఫ్యాక్షనిజానికి బలైన బాధితులమని రాంగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పడం మానేసి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

# 'యల్లమ్మ'కు అందుకే ఓకే చెప్పా..

# దేవి శ్రీ ప్రసాద్ స్పెషల్ వీడియో ఇదిగో!

**హీరోగా తన అరంగేట్రంపై స్పందించిన డీఎస్పీ**
**'యల్లమ్మ' సినిమాకు ఓకే చెప్పడానికి కారణం ఇదేనంటూ వెల్లడి**
**తన తండ్రి స్వగ్రామం వేదురుపాకతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న దేవి**
**చిన్నప్పటి జానపద కళలే స్ఫూర్తినిచ్చాయన్న సంగీత దర్శకుడు**
**వేణు యెల్దండి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో ఈ చిత్రం**

ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. వేణు యెల్దండి దర్శకత్వంలో 'యల్లమ్మ' అనే చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. అయితే, ఒక అగ్ర సంగీత దర్శకుడిగా ఉండి నటన వైపు ఎందుకు అడుగులు వేశారనే దానిపై డీఎస్పీ స్వయంగా స్పందించారు. తను ఈ సినిమా చేయడానికి అంగీకరించడం వెనుక ఉన్న అసలు కారణాన్ని మంగళవారం వెల్లడించారు.

ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన తండ్రి స్వగ్రామమైన వెదురుపాకలో తాను పర్యటించిన దృశ్యాలను అందులో చూపించారు. "చిన్నప్పటి నుంచి జానపద కళల పట్ల నాలో ఆసక్తిని నింపిన అద్భుతమైన సంప్రదాయాలు, సంస్కృతి ఇదే. మా ఊరిలో జరిగే 'అమ్మోరు జాతర' వేడుకలు నాపై తీవ్ర ప్రభావం చూపాయి. 'యల్లమ్మ'కు నేను ఎందుకు ఓకే చెప్పానో ఇదే కారణం" అని డీఎస్పీ పోస్ట్‌లో పేర్కొన్నారు.

చిన్నప్పుడు తన తండ్రి తమను చెన్నై నుంచి తరచూ ఈ గ్రామానికి తీసుకొచ్చేవారని, ఇక్కడి ప్రకృతి స్వచ్ఛతను ఆస్వాదించేలా చేశారని డీఎస్పీ గుర్తుచేసుకున్నారు. "మా మూలాలతో, మా వాళ్లతో సంబంధం కొనసాగేందుకు మేం ఇక్కడ అందమైన ఇల్లు కట్టుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం వంటి గొప్ప విషయాలను ఈ ఊరే నాకు నేర్పింది. అదే నాకు స్ఫూర్తినిచ్చింది" అని వీడియోలో వివరించారు. ఈ అనుబంధం కారణంగానే 'యల్లమ్మ' కథకు వెంటనే కనెక్ట్ అయినట్లు తెలిపారు.

దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడు వేణు, డీఎస్పీ మధ్య తొలి సమావేశం ఏకంగా 8 గంటల పాటు సాగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో డీఎస్పీ 'పర్శి' అనే పాత్రలో కనిపించనుండగా, సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు.





## కొలిక్కి రాని పర్సంటేజి

తెలుగు చిత్ర పరిశ్రమలో 'పర్సెంటేజ్' వివాదం ఇంకా కొనసాగుతోంది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రెంట్ విధానానికి బదులుగా పర్సెంటేజ్ విధానం అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో వసూళ్లలో శాతం చెల్లిస్తుండగా, సింగిల్ స్క్రీన్‌లకు మాత్రం అద్దె విధానం కొనసాగుతోంది. అందరికీ ఒకే విధానం ఉండాలనేది ఎగ్జిబిటర్ల వాదన. ఇదేదో 'పెద్ది' సినిమాను అడ్డుకునేందుకు చేస్తున్న పోరాటం కాదని, తమ మనుగడ కోసమేనని ఎగ్జిబిటర్లు, నిర్మాతలు చెబుతున్నారు. ఇప్పటికే ఈ వివాదంపై పరిశ్రమ పెద్దలు కమిటీ ఏర్పాటు చేశారు. అయితే నివేదిక ఆలస్యమైతే సినిమాల విడుదలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. జూన్ 4న రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో తాజాగా చిరంజీవి నివాసంలో సమావేశం జరిగింది. దిల్‌రాజు, సురేశ్‌బాబు, అల్లు అరవింద్, కేఎల్ నారాయణ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీసుకునే నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని చిరంజీవి సూచించారు. జూన్ 30లోపు కమిటీ అన్ని అంశాలు పరిశీలించి ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్లకు న్యాయం జరిగేలా 'పర్సెంటేజ్ మోడల్'పై ప్రతిపాదనలు చేస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ వివాదానికి ఆమోదయోగ్యమైన పరిష్కారం దొరుకుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## మా ఇంటి బంగారం

### - యక్షన్ సీన్స్ లో అదరగొట్టిన సమంత

హైదరాబాద్ : ప్రముఖ నటి సమంత తాజాగా నటించిన చిత్రం 'మా ఇంటి బంగారం–. ఈ సినిమా జూన్ 19న సినిమా విడుదల కానుంది. ఈనేపథ్యంలో మూవీ మేకర్స్ ట్రైలర్ని విడదుల చేశారు. ఈ సినిమాలో చీరకట్టులోనే సమంత యాక్షన్ సీన్స్ లో అదరగొట్టింది. ఈ మూవీ నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కింది. రాజ్ నిడిమోరు కథనాన్ని అందించారు.






# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ...

# గుజరాత్ కు మరో చాన్స్

- క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం
- ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు
- 33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం
- గుజరాత్ తరఫున రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం
- ఓడినా గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్-2లో తలపడనుంది.



ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది.

అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు.

ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు.

రేపు (మే 27) సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో మే 29న క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది.

## సబలెంక, ముఛోవా శుభారంభం

### - ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ లో టాప్ సీడ్, బెలారస్ కు చెందిన అర్యానా సబలెంకా, చెక్ రిపబ్లిక్ కు చెందిన 10వ సీడ్ ముఛోవా శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సబలెంక 6-4, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్ సీడెడ్ క్రీడాకారిణి బౌజన్ ను చిత్తుచేయగా.. ముఛోవా 7-5, 6-2తో వరుససెట్లలో రష్యాకు చెందిన జఖరోవా ను ఓడించింది. ఇతర పోటీల్లో 12వ సీడ్ నొస్కోవా(చెక్) 5-7, 6-7(3-7)తో అన్ సీడెడ్ సక్కారి(గ్రీక్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక 10వ సీడ్ లీగ(అమెరికా) 6-4, 6-2తో చైనాకు చెందిన జంగ్ ను, 17వ సీడ్ జోవిక్(అమెరికా) 6-4, 6-2తో ఇలా(ఫిలిప్పీన్స్)ను ఓడించి రెండోరౌండ్‌కు చేరారు.

**మెద్వదెవ్ ఔట్..**

6వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదేవ్ అనూహ్యంగా తొలిరౌండ్ లోనే ఓటమిపాలయ్యాడు. మంగళవారం జరిగిన ఐదుసెట్ల హోరాహోరీ పోరులో మెద్వదెవ్ 2-6, 6-1, 1-6, 6-1, 4-6తో అన్ సీడెడ్ వాల్టన్(ఆస్ట్రేలియా) చేతిలో ఓడాడు. ఇక సిట్సిపాస్(గ్రీక్) 6-2, 3-0తో ఆధిక్యతలో ఉన్న దశలో ముల్లర్(ఫ్రాన్స్) గాయంతో మైదానాన్ని వీడాడు. దీంతో సిట్సిపాస్ రెండోరౌండ్ కు చేరాడు. అలాగే 20 సీడ్ నార్రీ(బ్రిటన్) కూడా 6-7(7-9), 0-2తో అన్ సీడెడ్ ఆడాల్సో(పరాగ్వే)పై వెనుకబడి ఉన్న దశలో మ్యాచ్ నుంచి వైదొలిగాడు.

## చరిత్ర సృష్టించిన కోహ్లి విరాట్ కోహ్లి



ఐపీఎల్‌లో వరుసగా నాలుగు సీజన్లలో 600కుపైగా పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా కోహ్లి చరిత్ర సృష్టించాడు. 2023, 2024, 2025 సీజన్లలో విరాట్ 600o రన్స్ చేశాడు. ఇప్పుడు ఈ ఏడాది సీజన్‌లో కూడా కోహ్లి 50.00 సగటు, 164.38 స్ట్రైక్‌రేట్‌తో600పరుగులు చేశాడు. గతంలో క్రిస్ గేల్ (2011, 2012, 2013), డేవిడ్ వార్నర్ (2016, 2017, 2019), కేఎల్ రాహుల్ (2020, 2021, 2022) వరుసగా మూడు సార్లు ఈ ఫీట్ అందుకునరుగులు కానీ వరుసగా నాలుగు సీజన్లలో కోహ్లి మినహా మిగితా ఎవరూ ఈ ఘనత సాధించలేకపోయారు. అదేవిధంగా ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన జాబితాలో కోహ్లి నాలుగో స్థానానికి ఎగబాకాడు.

# మంగళగిరిలో పసుపు ప్రభంజనం

- డాక్యుమెంటరీ ఆవిష్కరణ
- ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌ల రాజకీయ ప్రస్థానంపై ప్రశంసలు.

**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం(మంగళగిరి):** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, కడపకు చెందిన రచయిత షేక్ మహమూద్ బాషా రచన, వ్యాఖ్యానంలో రూపొందిన 'పసుపు ప్రభంజనం: నాడు - నేడు - రేపు' డాక్యుమెంటరీని మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, పార్టీ సీనియర్ నాయకుడు వర్ల



రామయ్య తదితరులు కలిసి డాక్యుమెంటరీని విడుదల చేశారు. ఈ డాక్యుమెంటరీలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు సాగిన రాజకీయ ప్రస్థానాన్ని సమగ్రంగా చిత్రీకరించారు. ముఖ్యంగా విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు పార్టీ స్థాపించిన చారిత్రక నేపథ్యం, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పార్టీ సాధించిన అభివృద్ధి, ఐటీ విప్లవం, అలాగే నారా లోకేష్ యువతను ముందుకు నడిపిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్న తీరు వంటి అంశాలను ఆకట్టుకునేలా ప్రదర్శించారు. తెలుగుదేశం పార్టీ చరిత్రను, మూడు తరాల నాయకుల కృషిని షేక్ మహమూద్ బాషా ఎంతో సమగ్రంగా, ప్రభావవంతంగా ఆవిష్కరించారని టీడీపీ నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్యుమెంటరీ రూపకర్త మహమూద్ బాషాను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు.

# దమ్ముంటే ఉలిమెళ్ల తోటలో ఏం జరగలేదని జగన్ చెప్పాలి

- వైఎస్సార్సీపీ బ్లాంక్ చెక్ ఆఫర్‌ను తిరస్కరించిన బీటెక్ రవి
- దమ్ముంటే తన సవాళ్లకు జగన్ నేరుగా సమాధానం చెప్పాలి బీటెక్ రవి సవాల్

**పులివెందుల - సూర్య వాస్తవం :** గత ఎన్నికల్లో తన ఓటమికి సొంత పార్టీ వారే వెన్నుపోటు పొడిచారని, వైఎస్సార్సీపీ నేతలు కోట్లు ఆఫర్ చేసినా లొంగకుండా ధర్మబద్ధంగా నిలబడ్డానని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి స్పష్టం చేశారు. మంగళవారం పులివెందులలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డిలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీటెక్ రవి పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014 ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి ఉలిమెళ్ల తోటలో వైఎస్ జగన్, అవినాష్ రెడ్డిలతో తాను స్వయంగా సమావేశమయ్యానని రవి వెల్లడించారు. ఆ రోజు మీరు ఎ డబ్బులకు లాలూచీ పడి కస్నూరు ఎంపీటీసీని టిడిపి బ్యానర్‌పై ఏకగ్రీవంగా చేశారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉలిమెళ్ల తోటలో ఎలాంటి చర్చలు జరగలేదని జగన్ ప్రమాణం చేసి చెప్తే తాను రాజకీయాల నుండి తప్పుకోవడానికి సిద్ధమని సవాల్ విసిరారు. అమరావతి రాజధాని తీర్మానం సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని, లేదా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని వైఎస్సార్సీపీ పెద్దలు తనకు రూ 12 కోట్లు కాదు, ఏకంగా రూ 15 కోట్లు ఆఫర్ చేశారని బీటెక్ రవి సంచలన నిజం



బయటపెట్టారు. ఈ విషయాన్ని అప్పట్లోనే చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని, చివరకు ఆ ప్రలోభాలకు లొంగకుండా అమరావతికి అనుకూలంగా, వైఎస్సార్సీపీ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసి నిలబడ్డానని స్పష్టం చేశారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మొదటిసారి సీబీఐ విచారణ కోరుతూ కోర్టుకు వెళ్ళింది తానేనని రవి గుర్తుచేశారు. కేసు అడ్మిట్ అయిన తర్వాత భయపడిపోయిన వైఎస్సార్సీపీ ముఖ్య నేతలు తనతో పాటు ఆదినారాయణ రెడ్డి వద్దకు వచ్చి, కేసు వెనక్కి తీసుకుంటే బ్లాంక్ చెక్ ఇస్తామని, రూ 20 కోట్లు లేదా రూ 30 కోట్లు ఎంతైనా రాసుకోవచ్చని ఆఫర్ చేశారని వెల్లడించారు. ఆ ఆఫర్‌ను తిరస్కరించి కోర్టులో పోరాడబట్టే ఈరోజు జగన్ మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డిలు ముద్దాయిలుగా నిలబడ్డారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బ్రాహ్మణి స్టీల్స్‌కు సంబంధించిన ఎలక్ట్రికల్ వర్క్ కాంట్రాక్టును ఎల్ అండ్ టీ కంపెనీకి ఇప్పించినందుకు గాను వైఎస్సార్సీపీ నేతలు 5% కమిషన్ కింద రూ15 కోట్లు మాట్లాడారని, అందులో అడ్వాన్స్‌గా వచ్చిన రూ 6 కోట్లతోనే జగన్ ఇల్లు కట్టుకున్నారని రవి ఆరోపించారు. తొమ్మిది నెలలు కష్టపడి అరటి పంట పండించే పులివెందుల అరటి రైతుల నుండి టన్నుకు ఇంత అని కమిషన్లు వసూలు చేసి వ్యాపారులతో చేతులు కలిపి రైతులను దోచుకున్న నీచమైన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ధ్వజమెత్తారు. వైఎస్ వివేకా హత్య కేసులో సునీతమ్మ ఒత్తిడి పెంచడంతో, కేసు నుండి తప్పించు కోవడానికి, షెల్టర్ పొందడానికి తాను బీజేపీలోకి వెళ్తానని సాక్షాత్తు జగన్మోహన్ రెడ్డి తన చెల్లెలు సునీతతో అన్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.? గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో తనను రెండు సార్లు అక్రమంగా జైలుకు పంపినా, ప్రైవేట్ వ్యక్తులతో కిడ్నాప్ చేయించి ముసుగులు వేసి పిస్టల్ పెట్టి చంపుతామని బెదిరించినా తాను ఎక్కడా లొంగలేదని రవి గుర్తుచేశారు. జగన్ మోహన్ రెడ్డి లాగా తాను గోల్డెన్ స్పూన్‌తో పుట్టలేదని, ఒక సాధారణ టీచరు కొడుకుగా కష్టపడి పైకొచ్చానని, దమ్ముంటే తన సవాళ్లకు జగన్ నేరుగా సమాధానం చెప్పాలని బీటెక్ రవి సవాల్ విసిరారు.

## లచ్చనిపల్లి గ్రామంలో

# 18 లక్షలతో నూతన సీసీ డ్రైనేజీ కాలువలు

- నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండలం లచ్చనిపల్లి గ్రామంలో 18 లక్షలతో నూతన సీసీ డ్రైనేజీ కాలువలను ప్రారంభించిన గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముందుగా లచ్చనపల్లిలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే 18 లక్షలతో ఏర్పాటు చేసిన సిసి డ్రైనేజీ కాలువల ను ప్రారంభించారు. ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ పల్లెల అభివృద్ధి చెందాలంటే ఒక కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని తెలియ జేశారు అనంతరం లచ్చనిపల్లి గ్రా మ ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఉన్న సమస్యను ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి వెంటనే 18 లక్షల రూపా యలతో సీసీ డ్రైనేజీ కాలువలను చేయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పల్లెల అభివృద్ధి చెందాలంటే కూట మి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుం దని కొని



యాడారు కూటమి ప్రభు త్వానికి, గుంతకల్లు నియో జకవర్గం గుమ్మనూరు జయరాంకి అలాగే యువనేత గుమ్మనూరు ఈశ్వర్‌కి రుణపడి ఉండి జరగబోయే స్థానిక ఎలక్షన్లలో ఎవరు నిలబడిన గెలిపించుకొని తీరుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లచ్చనిప ల్లి గ్రామ ప్రజలు గుత్తి పట్టణ మరి యు మండల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# 32 రైతు సేవ కేంద్రాల నిర్మాణానికి రూ.6.33 కోట్ల నిధులు మంజూరు

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక కృషి



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ప్రత్యేక జీవో (జీవో ఆర్టీ నంబర్. 452) విడుదల రాష్ట్ర ఆర్థికప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కొద్దిరోజుల కిందట గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలకు నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేయడం, జరగగా తాజాగా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక కృషి చేయడంతో ఉరవకొండ నియోజక వర్గంలో అసంపూర్తిగా ఉన్న రైతు సేవ కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకోసం రూ.6.33 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మంగళవారం ప్రత్యేక జీవో విడుదల కావడం జరిగింది. వ్యవసాయ మరియు సహకార శాఖ బడ్జెట్ అంచనాలు మేరకు 2026-27 లో రైతు సేవ కేంద్రాలకి రూ. 6.33 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ప్రత్యేక జీవో విడుదల చేస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక దృష్టి సారించడం వల్ల ఉరవకొండ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ, రైతు సేవ కేంద్రాల భవనాల నిర్మాణం వేగవంతంగా పూర్తి అవుతాయి.

# క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్




**పులివెందుల - సూర్య వాస్తవం :** క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టరు ఖాజా మొహిద్దిన్ టీబీ డాక్టర్ జిషిత అన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం టిబీ ముక్త్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా పులివెందుల బాకరాపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డీ ఎం హెచ్‌వో డాక్టరు ఖాజా మొహిద్దిన్ టీబీ డాక్టర్ జిషిత క్షయ వ్యాధి నిర్మూలన పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని. ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందన్నారు. మైక్రో బ్యాక్టీరియ ట్యూ బెర్క్యు లసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా సోకుతుందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం చూపుతుందన్నారు. సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుంద న్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ కేంద్రంలో సంప్రదించాలన్నారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీనిని పూర్తిగా నివారించవచ్చునన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డిపిహెచ్ఓ సుబ్బారెడ్డి, ఎమ్‌పిహెచ్‌ఎస్ సతీష్ కుమార్, టీవీ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుడిబండ చెరువు వద్ద డ్రోన్ కెమెరాకు చిక్కిన మందుబాబులు..

- కేసు నమోదు చేసిన పోలీసులు!

**మడకశిర- సూర్య వాస్తవం :** పట్టణ శివారులోని గుడిబండ చెరువు ప్రాంతంలోపోలీసులు డ్రోన్ సాయంతో నిఘా నిర్వహించి, బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. జూదరులు, బహిరంగంగా మద్యం సేవించేవారు,



మరియు పెద్ద ఎత్తున జరిగే ఉత్సవాలపై కూడా డ్రోన్ నిఘా కొనసాగుతుందని ఎస్సై రమేష్ బాబు తెలిపారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటమే పోలీసుల యొక్క ముఖ్య లక్ష్యం. సాంకేతికతను ఉపయోగించి నేరాలను అదుపు చేయడంలో పోలీసులు తీసుకుంటున్న ఈ నిర్ణయం మంచి ఫలితాలను ఇస్తుంది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )




# ప్రైవేట్ విద్యాసంస్థల ఓవర్ యాక్షన్‌కు ప్రభుత్వం షాక్..!


**- నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాల్సిందే - పుస్తకాలు, బట్టలు, విక్రయాలపై నిషేధం**

**- ఫీజులు, ఉపాధ్యాయ వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలి....ప్రభుత్వ ఆదేశాలు**

సూర్య వాస్తవం - ప్రత్యేక కథనం

ఈ ఏడాది అనూహ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పదోతరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు లభించాయి. కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఫలితాలు వచ్చాయి. మంత్రి లోకేష్ తాను నిర్వహిస్తున్న విద్యాశాఖపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతున్నారు. వీలైనంత అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల్ని రప్పించే ప్రయత్నాలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రైవేటు విద్యాసంస్థలు ఓ పథకం ప్రకారం విష ప్రచారం మొదలెట్టాయి. కాకినాడకు చెందిన ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకుడు యాజమాన్య సంఘ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలకు సైతం పాల్పడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థుల్ని మాస్ కాపీయింగ్కు ప్రోత్సహించారని, వారు పరీక్షలు రాస్తున్న తరగతి గదులకు ఉపాధ్యాయులు వెళ్ళి మరీ ప్రశ్నలకు జవాబులు చెప్పొచ్చారంటూ ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగానే ప్రభుత్వ విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయి.. అంతే తప్ప అది ఆ విద్యాసంస్థల గొప్పతనం కాదంటూ కొట్టిపారేశారు. పైగా దీన్నితమ సంఘం తరపున సమర్థవంతంగా ఎదుర్కొని ప్రైవేటు పాఠశాలల ఆధిపత్యాన్ని కొనసాగిస్తామని కూడా శపథం చేశారు.

ఈ విషయం కాకినాడ విద్యాశాఖ అధికారి ద్వారా ప్రభుత్వానికి చేరింది. దీంతో ప్రైవేటు పాఠశాలల నిర్వహణలో చట్టం నిర్దేశిస్తున్న నిబంధనల్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ య్యాయి.






# సబ్ రిజిస్ట్రార్ల అవినీతి మాయా జాలం..?

- చేతులు తడిపితేనే ఫైల్ ముందుకు..!
- అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పామిడి రిజిస్ట్రేషన్ కార్యాలయం
- అక్కడ అంతా రైటర్లదే రాజ్యం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతా అవినీతి

పామిడి - సూర్య వాస్తవం

సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడుతున్న జవాన్లకు రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి అండగా ఉండాలి... ఎక్కడ ప్రభుత్వం పెద్దలు....? జవాన్ల భూములకు సంబంధించిన ఏవైనా వివాదాలు, కబ్జాలు ఉంటే ఆయా జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సత్వరమే విచారణ జరపాలి.. మరి జవాన్లకు న్యాయం జరిగేనా...

పామిడి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి చిరునామాగా మారాయని విలేకరుల సమావేశంలో పాళ్యం తండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తమ్ముడు భాస్కర్ నాయక్ తెలియజేశారు.

వివరాల్లోకి వెళితే సర్వే నంబర్, 150/1 నందు మా తాత గారి పిత్ర జీతం

అనంతపురం జిల్లా పామిడి మండలం పాళ్యం తండా గ్రామంలో నివసించే ఇప్పుడు మా తాత గారి పిత్రాజితం సర్వేనెంబర్ 150/1 సర్వే నంబర్లు బి, వాలే నాయక్ ఢ చ చక్ర్ నాయక్ కుమారుడు సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ దేశం కోసం పోరాడుతుంటే మా సొంత గ్రామంలో ఉండే పొలాలని దేశాన్ని కాపాడుతుంటే సొంత పొలాన్ని కాపాడలేకపోతున్నానని పత్రికా విలేకరుల సమావేశంలో తెలియజేశారు ఈ సర్వే నంబర్‌లో 1.32 సెంట్లు ఉంటే ఈ భూమిని అన్నోన్ పర్సన్ అయినటువంటి ఆర్, వెంకటేష్ నాయక్. 21 సెంట్లు ఆర్ వెంకటేష్ నాయక్. 21 సెంట్లు. ఆర్ కృష్ణ నాయక్ 21 సెంట్లు దేవల నాయక్ 21. భూమిని మొత్తం84 సెంట్లు భూమి ని పామిడి రిజిస్టర్ ఆఫీస్ వారు ఎటువంటి ప్రూఫ్స లేకుండా ఒకటే ఇంటి గుత్తతో నలుగురికి డబల్ రిజిస్ట్రేషన్ చెయిూచిన రైటర్ చంద్రమౌళి రైటర్ చెప్పిందే వేదం చేసిందే వేదం అంటూ పామిడి సబ్ రిజిస్టర్ ,పాత రిజిస్టర్ రాధా రమణ ఇరవై ఒక్క సెంటుఆఫీస్ లో జరుగు తున్న తతంగం రిజిస్టర్ పద్మజ. చేసిన తదంగం

**డాక్యుమెంట్ రైటర్లదే హవా ?**

ఆ కార్యాలయానికి ప్రజలు నేరుగా వెళ్తే ఏ పనీ జరుగదు.. ఏ చిన్న పనైనా డాక్యుమెంట్ రైటర్స్ కలవాల్సిందే.. వారు రాసిందే రాత... గీసిందే గీతగా మారింది డాక్యుమెంటు రైటర్ల వ్యవహార మని.....వారు చెప్తేనే అటెండర్ నుంచి అధికారుల వరకు పనిచేస్తారు. ఇదీ పామిడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ జరుగుతున్న తంతు అని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకొని అన్ని పత్రాలతో ప్రజలు వస్తున్నప్పటికీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మాత్రం బ్రోకర్లు( డాక్యుమెంట్ రైటర్స్ )సూచించిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నేరుగా వచ్చిన వారిని గంటల కూర్చోబెట్టడంతో చివరకు వారు సైతం బ్రోకర్లను ఆశ్రయించాల్సి వస్తున్నదని.... అధికారుల అండ దండలతో కొందరు డాక్యుమెంట్ రైటర్లుగా చలామణి అవుతూ పైసలు దండుకుంటు న్నాకోనీ రిజిస్టర్లు చేస్తున్నారు నే విమర్శలు వినిపిస్తు న్నాయి. విమర్శలు వస్తున్నాయి.. కాసుల కోసం సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్నారని దాపురించిందని అక్కడి ప్రజలు వాపోతున్నారు ఉన్నారు.



సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు అధికారికంగా జరుగుతున్నప్పటికీ.. 90 శాతానికి పైగా భూమి, స్థిరాస్తి లావా దేవీల 'హవా' అంతా డాక్యుమెంట్ రైటర్ల చేతుల్లోనే నడుస్తుంది. పత్రాల తయారీ, ప్రభుత్వ చార్జీల లెక్కింపు, స్లాట్ బుకింగ్ వంటి కీలకమైన పనులన్నీ వారే ముందస్తుగా సిద్ధం చేస్తారు.

# బీసీల సాధికారతకు మరో అడుగు

**- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా చెందేటి సుజాతకు ఘన సన్మానం**

**-నాయుడుపేటలో అభినందనల వెల్లువ**

**- శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కారం**

**- మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు**





**నాయుడుపేట- సూర్య వాస్తవం:** రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన చెందేటి సుజాతకు నాయుడుపేట పట్టణంలో ఘన సన్మానం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయిలో ఆమెకు లభించిన ఈ గౌరవప్రదమైన పదవి పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.ఇటీవల హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా చెందేటి సుజాత రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట పట్టణంలోని ఆమె కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, చెందేటి సుజాతకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళా ప్రతినిధులు కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షురాలు జె. రేవతి, ఉపాధ్యక్షురాలు కె. సుజాత, స్టేట్ జనరల్ సెక్రటరీ శ్రీను, సభ్యులు పి. లక్ష్మి, కె. చందు, పి. రూప, ఎ. శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీల సంక్షేమం కోసం చెందేటి సుజాత మరింత కృషి చేసి, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ఆమె నాయకత్వం దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏపీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదల


**- ఫలితాలను ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

**- ఈ ఏడాది 99.30 శాతం ఉత్తీర్ణత నమోదు**

**- పరీక్షకు హాజరైన 19,880 మందిలో 19,741 మంది అర్హత**

**- అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్‌లోనూ ఫలితాలు అందుబాటులో**

అమరావతి - సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్‌లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎడ్‌సెట్)-2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్‌లో రికార్డు స్థాయిలో 99.30 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 19,880 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 19,741 మంది అర్హత సాధించినట్లు మంత్రి లోకేష్ తన ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచి, అర్హత సాధించిన అభ్యర్థు లందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను సులభంగా తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తదుపరి కౌన్సెలింగ్‌కు హాజరై, రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు.